విశాలాంధ్ర

ప్రకాశం

బాపట్ల

శనివారం 15 నవంబరు 2025

8 పేజీలు

విద్యార్థులకు సరైన సౌకర్యాలు కల్పించాలి

కలెక్టర్ రాజాబాబు

విశాలాంధ్ర-ఒంగోలు : ప్రజలతో పాటు విద్యాలయాలు, సంక్షేమ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు సురక్షిత తాగునీరు అందించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై వుందని, అందుకనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ లోని తన చాంబర్‌లో కలెక్టర్, ఆర్డబ్ల్యూఎస్. శాఖ అధికారులు, మున్సిపల్ కమీషనర్లు, పంచాయతీ రాజ్, సంక్షేమ వసతి గృహాల అధికారులు, విద్యా శాఖ అధికారులతో సమావేశమై ప్రజలకు, విద్యార్థులకు సురక్షిత తాగునీరు అందించేలా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించి, దిశానిర్దేశం చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలతో పాటు విద్యాలయాలు, సంక్షేమ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు సురక్షిత తాగునీరు అందించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై వుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ప్రజలకు కనీస అవసరాలైన త్రాగునీరు అందించడంలో ఖర్చు చేస్తున్నదన్నారు. గ్రామాన్ని/మున్సిపాలిటీని యూనిట్‌గా తీసుకుని ఎంత మంది ప్రజలు నివశిస్తున్నారు. త్రాగునీటి వనరుల లభ్యత ఎక్కడినుండి వస్తున్నది, అలాగే ఎన్ని బోర్లు పనిచేస్తున్నాయి, ఆ నీటిలో ఫ్లొరైడ్ శాతం ఎంత వుంది, అలాగే ఎన్ని ఆర్‌ఓ ప్లాంట్స్ పనిచేస్తున్నాయి, ఆ ఆర్‌ఓ ప్లాంట్స్‌కు నీటి వనరుల లభ్యత ఎక్కడినుండి వస్తున్నది తదితర వివరాలతో సమగ్ర నివేదికతో పాటు మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేసి రెండు మూడు రోజుల్లో సమర్పించాలని జిల్లా కలెక్టర్, ఆర్డబ్ల్యూఎస్., మున్సిపల్ కమీషనర్లు, పంచాయతీ రాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే ఎస్.సి., ఎస్.టి., బిసి వసతి గృహాలు, రెసిడెన్షియల్ స్కూల్స్. విద్యాలయాల్లో ఎంత మంది విద్యార్థులు ఉంటున్నారు, వాటికి నీటి వనరుల లభ్యత ఎక్కడినుండి వస్తున్నది, ఎన్ని ఆర్‌ఓ ప్లాంట్స్ ఉన్నాయి, వాటిలో ఎన్ని పని చేస్తున్నాయి, ఎన్ని పనిచేయడం లేదు, ఏ కారణంగా అవి పనిచేయడం లేదు తదితర వివరాలతో సమగ్రంగా నివేదిక తయారు చేసి సమర్పించాలని కలెక్టర్ సంక్షేమ వసతి గృహాల అధికారులను, విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. ఉన్న ఆర్ ఓ ప్లాంట్స్ నిర్వహణ పై రెగ్యులర్ పర్యవేక్షణ ఉండేలా కార్యాచరణ ప్రణాళికలు రుపొందించాలని కలెక్టర్, సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సి.ఈ.ఓ చిరంజీవి, డిపిఓ వెంకటేశ్వర రావు, ఆర్ డబ్ల్యూఎస్ ఎస్.ఈ బాల శంకర రావు, సోషల్ వెల్ఫేర్ డిడి లక్ష్మా నాయక్, పబ్లిక్ హెల్త్ ఈఈ శ్రీ సంజయ్ కుమార్ పాల్గొన్నారు.

బాలల సంరక్షణలో పోలీసు శాఖ ఎల్లవేళలా ముందే..

ఎస్పీ హర్షవర్ధన్ రాజు

విశాలాంధ్ర-ఒంగోలు : బాల్య న్యాయ చట్టం, పోక్సో చట్టం, పిల్లలకు సంబంధించిన ఇతర చట్టాలపై అవగాహన పెంపొందించేందుకు, పిల్లలతో వ్యవహరించే బాలల సంక్షేమ పోలీస్ అధికారులు, మహిళా సహాయక కేంద్రం సిబ్బంది, శక్తి టీమ్స్, జిల్లా ఎహెచ్‌టియు బృందంతో ఒంగోలులోని జిల్లా పోలీస్ కళ్యాణ మండపంలో జిల్లా స్థాయి ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ పోక్సో చట్టం, జువెనైల్ జస్టిస్ యాక్ట్ 2015, బాల్య వివాహాల నిర్మూలన, బాలల సంరక్షణ వంటి కీలక చట్టాలపై పోలీస్ సిబ్బంది మరింత అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. బాధిత బాలబాలికలకు న్యాయం చేయడంలో చట్టప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలని కూడా ఆదేశించారు. శక్తి కాల్స్, డయల్ 100/112, ఉమెన్ హెల్ప్ లైన్ -181 ద్వారా ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత పోలీసులు చురుకుగా స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు. శక్తి టీమ్ ఏర్పాటుచేసినప్పుడు నుండి 3000 పైగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని, 813 ఎస్ఓఎస్ కాల్స్‌కు వెంటనే స్పందించటం జరిగిందని తెలిపారు.

'టెట్'ను సర్వీస్ ఉపాధ్యాయులకు

మినహాయించాలి

ఎస్టీయూ నాయకులు కె.యర్రయ్య

విశాలాంధ్ర-మార్కాపురం : ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ ఎలిమెంటరీ ఆర్గనైజేషన్‌లో భాగస్వామ్య సంఘమైన ఎస్‌టియు ఏపి సంయుక్తంగా నిర్వహించిన టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్‌ను సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు మినహాయించాలని కోరుతూ ఢిల్లీలోని జంతర మంతర్ నందు జాతీయ కార్యదర్శి సుధాకర్ సావంత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రకాశం జిల్లా నుండి యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.యర్రయ్య పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ 30 సంవత్సరాల క్రితం ఉపాధ్యాయ వృత్తిలో చేరిన ఉపాధ్యాయులను ఇప్పుడు టెట్ పాస్ కావాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పై పునః పరిశీలించాలని, అలాగే అన్నీ రాష్ట్రప్రభుత్వాలు రివ్యూ పిటిషన్ వేయాలని లేదంటే లక్షలాది మంది ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తే తగినమూల్యం చెల్లించుకోవాల్సివాస్తుందని హెచ్చరించారు. ఈ సమస్యపై దేశావ్యాప్త ఉద్యమాలు చేపడుతామని, అలాగే సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి ఓపిఎస్‌ను అమలుచేయాలనీ ఆయన డిమాండ్ చేశారు. 2003 డిఎస్‌సి వారికీ కేంద్రప్రభుత్వం జారిచేసిన మెమో నెంబర్ 57 ప్రకారం వారికీ ఓల్డ్ పెన్షన్ స్కీమ్ అమలుచేయాలనీ రాష్ట్రప్రభుత్వాలను ఆయన కోరారు. టెట్ విధానంపై ఢిల్లీలో గళమెత్తిన మొట్టమొదటి సంఘం తమదేనని, టెట్ నుండి సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు మినహించేంత వరకు పోరాటం ఆగదని ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు కె. యర్రయ్య పాలక వర్గాన్ని హెచ్చరించారు.

నాలుగు ఆటిజం కేంద్రాలు మంజూరు

కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

విశాలాంధ్ర -బాపట్ల : బాపట్ల జిల్లాకు 4 ఆటిజం కేంద్రాలు మంజూరు కావడం జరిగిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఉదయం మంగళగిరి మండలం, చినికాకని గ్రామం నందు ఉన్న జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో ఉన్న భవిత సపోర్ట్ సెంటర్ (ఆటిజం)ను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో 25 భవిత కేంద్రలలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. భవిత సెంటర్లకు ఎక్కువ మంది పిల్లలు రావడం జరుగుతుందని, ప్రతి భవిత సెంటర్లలో సుమారు 40 నుండి 50 మంది పిల్లలు ఉన్నారని, రోజురోజుకు పిల్లలు ఎక్కువగా భవిత కేంద్రానికి వస్తున్నారని తెలిపారు. ఒక మంచి ఆలోచనతో సమగ్ర శిక్ష అభియాన్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రపంచ బ్యాంక్ ప్రాజెక్టు కింద ఈ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, స్తోమత లేని పిల్లలు బయటికి వెళ్లి ఎక్కువ డబ్బులు ఖర్చు చేసి ఫిజియోథెరపీ చేయించుకోలేరని అలాంటి వారందరూ ఆటిజం సెంటర్లో చేరుతున్నారని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ఈ ఆర్థిక సంవత్సరంలో అదనపు నిధులు మంజూరు చేయడం జరిగిందని, రాబోయే ఆర్థిక సంవత్సరంలో కూడా ఎక్కువ నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. డీఈఓ సమగ్ర శిక్ష అభియాన్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, రాష్ట్ర ప్రభుత్వానికి అడ్వైజర్‌గా ఉన్న రామ కమల్ చేస్తున్నటువంటి కృషిని ప్రణాళికను గురించి తెలుసుకోవడం జరిగిందన్నారు. విద్య శాఖ,కార్యదర్శి, పాఠశాల విద్య కమిషనర్, డైరెక్టర్ సమగ్ర శిక్ష వారి సహకారంతో జిల్లాలోని నాలుగు ఆటిజం సెంటర్లను అందుబాటులోకి తీసుకురావడానికి జరుగుతుందన్నారు. అనంతరం స్కూల్ నందు నిర్వహించు ఖోఖో క్రీడాకారులను కలెక్టర్ పరిచయం చేసుకుని ఖోఖో ఆటను కలెక్టర్ ప్రారంభించారు. పిల్లలు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి వెళ్లి దేశ అభివృద్ధిలో పాల్గొన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా పిల్లలందరికీ శుభాకాంక్షలు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఈఓ పురుషోత్తం, సమగ్ర శిక్ష అభియాన్ ఈ ఈ. నాగజ్యోతి,ఏ ఈ రాజేష్, కోఆర్డినేటర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, టీచర్లు పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి : కలెక్టర్ 2 లో..

చిన్నకండ్లేరు చెరువు గండితో రైతుల్లో ఆందోళన 3 లో..

మాల్యాద్రి ఆర్థికసాయం

విశాలాంధ్ర-పొన్నలూరు : మండల కేంద్రమైన పొన్నలూరు గ్రామానికి చెందిన ఉప్పుటూరు రాధికా ఆరోగ్య పరిస్థితి కుటుంబ పరిస్థితి బాగాలేదని ఏమైనా కొంత సహాయం చేయమని మండల జనసేన పార్టీ మండల నాయకుడు మాల్యాద్రి దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన మాల్యాద్రి మండల నాయకులతో సంప్రదించి శుక్రవారం కొంత నగదు, రెండు నెలలకు సరిపడ నిత్యవసర సరుకులు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ భాషా తిరుమలరెడ్డి ఎన్ బ్రహ్మయ్య బిరుదుల డానియల్ పి మాధవరావు మెడసల అనిల్ పలువురు జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు జయకుమార్ శుభాకాంక్షలు

విశాలాంధ్ర - సింగరాయకొండ : జిల్లా హ్యూమన్ రైట్స్ సమన్వయకర్తగా నియమితులైన సందర్భంగా సింగరాయకొండ మండలం సుందరనగర్ గ్రామానికి చెందిన సాంత్వాన సేవా సమితి డైరెక్టర్ రావినూతల జయకుమార్ శుక్రవారం కలెక్టర్ రాజాబాబును ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. స్వచ్ఛంద సంస్థ తరఫున తాను చేస్తున్న కార్యక్రమాలు గురించి కలెక్టర్ కు వివరించారు. ఇంకా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ జయకుమార్‌ను అభినందించినారు.

తిరుమల హైస్కూల్లో బాలల దినోత్సవం

విశాలాంధ్ర- కురిచేడు : మండలంలోని నమశ్శివాయ పురం గ్రామంలో ఉన్న తిరుమల స్కూల్లో బాలల దినోత్సవం కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కరస్పాండెడ్ కెవి రత్నాచారి భారత మాజీ ప్రధానమంత్రి జవహర్లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కరస్పాండెడ్ రత్నాచారి మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన తరువాత మొట్టమొదటి ప్రధానిగా పండిట్ జవహర్లాల్ నెహ్రూ ప్రధానమంత్రి అయ్యారని, ఆయన జన్మించిన రోజున బాలల దినోత్సవం జరుపుకోవడం మనందరం సంతోషంగా జరుపుకుంటున్నామని, నెహ్రూకు పిల్లలు అన్నా, గులాబీ పువ్వులన్నా చాలా ఇష్టం అని, పిల్లలు జాతి సంపదలుగా చెబుతూ ఉండేవాడని, ఆయన పాలనలో దేశంలో బాలల అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. అందుకే ఆయన పుట్టినరోజు మనదేశంలో బాలల దినోత్సవం నిర్వహిస్తున్నారని అన్నారు. వారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తులో మీరు ఎదిగి ఉన్నత స్థాయికి చేరుకోవాలని, అభివృద్ధి చెంది దేశ ప్రగతికి మీరు భాగస్వామ్యులు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు విద్యార్థినీ విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

డాగ్ స్క్వాడ్, బీడి టీమ్‌తో తనిఖీలు

విశాలాంధ్ర-మార్కాపురం : ఢిల్లీలో బాంబు పేలుళ్ల సంఘటన నేపథ్యంతో పాటు ఉగ్రవాదుల దాడుల నేపథ్యంలో శుక్రవారం మార్కాపురం పట్టణంలో బాంబు డిస్పోజబుల్ స్క్వాడ్(బీడీ), డాగ్స్క్వాడ్ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో ఆకస్మికతనిఖీలు చేపట్టారు. రైల్వేస్టేషన్, ఆర్టీసి బస్టాండు, చెన్నకేశవస్వామి గుడి, పాత బస్టాండు, ఆర్టీసి కార్గో ఆఫీసులో తనిఖీలు చేశారు. అనుమానిత పార్సిల్స్ను ప్రయాణీకుల బ్యాగులను డాగ్స్క్వాడ్తో తనిఖీ చేయించారు. మార్కాపురం సీఐ సుబ్బారావు, ఒంగోలు స్పెషల్ స్క్వాడ్ సీఐ సురేష్. రూరల్ ఎస్సై అంకమరావు, ట్రాఫిక్ ఎస్సై అహరోన్ పాల్గొన్నారు. అనుమానిత వస్తువులు, వ్యక్తులు కనిపిస్తే తమకు సమాచారం అందించాలని సీఐ తెలిపారు. పార్సిల్స్ కార్యాలయాల్లో కూడా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, బస్టాండుల్లో కూడా ప్రయాణీకులు నిర్లక్ష్యంగా ఉండవద్దని చెప్పారు.

బాలకార్మిక రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

- కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

విశాలాంధ్ర -బాపట్ల : బాల కార్మిక రహిత జిల్లాగా బాపట్లను తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన జిల్లాస్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. బడి బయట పిల్లలను క్షేత్రస్థాయిలో గుర్తించాలని కలెక్టర్ చెప్పారు. 14 సంవత్సరాలలోపు బాల, బాలికలు దుకాణాలు, వాణిజ్య కేంద్రాలు, హోటల్స్, దాబాలు, బడ్డీ బంకులులో పనిచేయడం నేరమన్నారు. వారి చేత పనులు చేయిస్తే చట్టరిత్యా చర్యలు తీసుకుంటామన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. టాస్క్ ఫోర్స్ కమిటీ పనితీరుపై సమగ్ర నివేదిక లేకపోవడం ఏమిటని అధికారులను నిలదీశారు. గడిచిన నెల రోజుల్లో కమిటీ పనితీరు సరిగా లేదన్నారు. పనిచేయకుండా ఏం చేస్తున్నారంటూ ఆరా తీశారు. అధికారులు పనితీరు మార్చుకోవాలన్నారు. టాస్క్ ఫోర్స్ కమిటీ క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. ఆకస్మికంగా దాడులు నిర్వహించినప్పుడే బాలల హక్కులను పరిరక్షించగలరన్నారు. బాలల చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా పని ప్రాంతాలలో సదస్సులు నిర్వహించాలన్నారు. అధికారులు నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు. గైర్హాజరైన కమిటీ సభ్యులు, నివేదిక లేకుండా సమావేశానికి వచ్చిన వారికి నోటీసులు ఇవ్వాలన్నారు. చట్టం ఏం చెబుతుందో.. తూచా తప్పకుండా పాటించాలని సూచించారు. ఈ శ్రమ పోర్టల్ లో కార్మికుల నమోదు ప్రక్రియ వేగంగా చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. ఈ శ్రమ పోర్టల్‌లో జిల్లాలో 3.84 లక్షల మంది కార్మికులను నమోదు చేయించాలని లక్ష్యం కాగా, ఇప్పటివరకు కేవలం 1.83 లక్షల మంది నమోదు కావడంపై ఆరా తీశారు. అసంఘటిత రంగ కార్మికులను పోర్టల్‌లో చేర్పించాలన్నారు. చేనేత కార్మికులు, భవన నిర్మాణ రంగ కార్మికులు, పంచాయతీ, మున్సిపాలిటీలలోని కార్మికులందరికి సభ్యత్వ నమోదు ప్రక్రియ చేపట్టాలన్నారు. ప్రతినెల కనీసం 10,000 మందిని సభ్యులుగా చేర్పించడం లక్ష్యంతో అధికారులు పనిచేయాలన్నారు. కార్మిక చట్ట ప్రకారం ఆయా శాఖల ద్వారా పన్నుల వసూలు, సంక్షేమ బోర్డుకు చెల్లింపులపై ఆరా తీశారు. సమగ్ర నివేదిక లేకపోవడంపై అధికారులను ప్రశ్నించారు. అధికారులు పద్ధతి మార్చుకోవాలని, మరోసారి ఇలా ఉండరాదన్నారు. ప్రభుత్వం ఉద్దేశం, అనుకూలత, ఆలోచనలకు తగినట్టుగా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని మార్గ నిర్దేశం చేశారు. కార్మిక సంక్షేమ బోర్డు పనితీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్మికులకు మేలు జరిగేలా సంక్షేమ బోర్డు అందుబాటులోకి తీసుకురావాలని, ఆ దిశగా కార్మిక శాఖ అధికారులు పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో డి ఆర్ ఓ జి.గంగాధర్ గౌడ్, కార్మిక శాఖ ఉప కమిషనర్ వెంకట శివ ప్రసాద్, అదనపు ఎస్పీ పి జగదీష్ నాయక్, కమిటీలోని వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

విశాలాంధ్ర-మార్కాపురం : విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మార్కాపురం డిప్యూటీ డీఈఓ. మామిళ్లపల్లి శ్రీనివాసులు, ఏపి మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ 'మీర్జా షంషేర్ అలీబేగ్ అన్నారు. శుక్రవారం బాలల దినోత్సవం సందర్భముగా జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన వేడుకలకు వీరివురు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఈ సారి పదవ తరగతి విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి మార్కాపురానికి రాష్ట్రస్థాయిలో గుర్తింపు తేవాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం. చంద్రబ్రెడ్డితో ఫిజికల్ డైరెక్టరు దామోదర్, ఉపాధ్యాయులు జివల్ రమేష్బాబు. పెద్దారవీరు ఎలఈడ సుబ్రమణ్యం, రెడ్డీ సంక్షేమ సంఘం ఆధ్యక్షులు గుంటక సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు. స్ఫూర్తి సొసైటీ దివ్యాంగుల పాఠశాలలో విద్యార్థులకు సీఐ సుబ్బారావు, రూరల్ ఎస్సై అంకమరావులు పెన్నులు, పుస్తకాలు, స్వీట్లు అందచేశారు.

ఎన్ఎస్‌కు అన్నా, కేపి, జంకె ఘన నివాళి

విశాలాంధ్ర-మార్కాపురం : మార్కాపురం పట్టణానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త నాదెళ్ల సుబ్రమణ్యం భౌతిక ఖాయానికి మార్కాపురం వైయస్సార్సీపి ఇన్చార్జి అన్నా రాంబాబు. గిద్దలూరు ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే కేపి నాగార్జునరెడ్డి. మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, కర్నూలు జిల్లా కోడుమూరు వైయస్సార్సిపి ఇన్చార్జి డాక్టర్ ఆదిమూలపు సతీష్, మున్సిపల్ మాజీ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, కౌన్సిలర్లు కొత్త కృష్ణ, సిరాజ్, డాక్టర్ చప్పల్లి కనకదుర్గ, నగేష్, తాల్లపల్లి ప్రసాదు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాపలు అర్పించారు. ఆయన కుమారుడు నాదెళ్ల చంద్రమౌళీని పరామర్శించారు.

వైసీపీ బలోపేతానికి కృషి చేయాలి

మాజీ మంత్రి మేరుగ నాగార్జున

విశాలాంధ్ర-మద్దిపాడు : వైసీపీ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్క కార్యకర్త పనిచేయాలని మాజీ మంత్రి మేరుగ నాగార్జున తెలిపారు శుక్రవారం ఇ నమన మెల్లూరులో గ్రామ పార్టీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. గ్రామ యూత్ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాసరావు బీసీ సెల్ అధ్యక్షులు కరవాది శివరామకృష్ణ మహిళా అధ్యక్షురాలు బత్తుల స్రవంతి రైతు విభాగం అధ్యక్షుడు మా రెడ్డి శ్రీనివాస్ రెడ్డి విద్యార్థి విభాగం అధ్యక్షుడు షేక్ వినయ్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వై శ్రీనివాసరావు ఎస్టీ సెల్ అధ్యక్షులు చలంచర్ల పూర్ణచందర్రావు తోపాటు గ్రామ కమిటీ అధ్యక్షులను విద్యార్థి సోషల్ మీడియా అధ్యక్షులను ఎన్నుకున్నారు.

బీఎల్‌ఓలు విధులు సమన్వయం చేసుకోవాలి

విశాలాంధ్ర-మద్దిపాడు : ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నూతన ఓటర్ల జాబితా తయారీలో బూతు లెవెల్ ఆఫీసర్ బాధ్యతగా ప్రజలను సమన్వయం చేసుకొని విధులు పట్ల అంకితభావంతో పనిచేయాలని మద్దిపాడు తాసిల్దార్ వేమూరి ఆదిలక్ష్మి తెలిపారు. శుక్రవారం మద్దిపాడు తాసిల్దార్ కార్యాలయంలో బియల్ ఓ లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బిఎల్వోలు గ్రామస్థాయిలో కీలకంగా వ్యవహరించి సమాచారం తీసుకోవాలని తెలిపారు. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. బిఎల్వోలు ఎప్పటికప్పుడు ఓటర్ జాబితా తయారీలో బాధ్యతగా వ్యవహరించాలి అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాల్సిన బాధ్యత బిఎల్‌ఓలపై ఉందన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరకు ఓటు హక్కు కల్పించాలని తెలిపారు. బి ఎల్ ఓ విధులు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని ఎప్పటికప్పుడు లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ అజయ్ రెడ్డి ఆర్ఐ రమణయ్య వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ బాలల దినోత్సవం

విశాలాంధ్ర - బేస్తవారిపేట : జాతీయ బాలల దినోత్సవాన్ని మండలంలోని అన్ని పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారతదేశ మొదటి ప్రధాన మంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో జరిగిన బాలల దినోత్సవ కార్యక్రమంలో తహశీల్దార్ ఎ. జితేంద్ర, ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు ముఖ్య అతిధులుగా పాల్గొని నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన

విశాలాంధ్ర-ఒంగోలు : ఎయిడ్స్ నివారణతోపాటు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం అనే కార్యక్రమాలు చేపట్టిందని, దీనిలో భాగంగా ఇంకా గ్రామీణ స్థాయి వరకు విస్తృత అవగాహన కల్పించేందుకు ఒక వినూత్నమైన వాహనాన్ని కేటాయించిందని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ఇంటిగ్రేటెడ్ కౌన్సిలింగ్ టెస్టింగ్ సెంటర్ వాహనాన్ని శుక్రవారం ఆయన ప్రకాశం భవనంలో రిబ్బన్ కట్ చేసే జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులతోపాటు వ్యాధి లక్షణాలు ఉన్న అనుమానితులు వైద్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు కౌన్సిలింగ్ పొందేందుకు ప్రత్యేక వాహనాన్ని ప్రభుత్వం రూపొందించి జిల్లాకు అందించినట్లు చెప్పారు. ఈ వాహనంలో ఏర్పాటు చేసిన సదుపాయాలను కలెక్టర్ పరిశీలించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటేశ్వర్లు ఈ వాహనం వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. వ్యాధిగ్రస్తులు పౌష్టికాహారం, తగిన జాగ్రత్తలు పాటించడం వల్ల వ్యాధి వ్యాప్తి చెందకుండా అరికట్టేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ కౌన్సిలింగ్ వాహనంలో ఒక వ్యక్తి మాత్రమే ఉండి పరీక్షలు చేయడంతో పాటు కౌన్సిలింగ్ ఇవ్వడం వల్ల రోగి యొక్క వివరాలు బయటకు తెలిసే అవకాశం లేదని చెప్పారు. కాబట్టి ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నివారణ అధికారి బాలాజీ, సెక్టరోల్ అధికారులు, ఎయిడ్స్ నివారణ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నకండ్లేరు చెరువు గండితో రైతుల్లో ఆందోళన

విశాలాంధ్ర-పుల్లలచెరువు : మండల పరిధిలోని చిన్నకండ్లేరు చెరువులో ఇటీవల లీకేజీ సంభవించి నీరు వృథా అవుతున్న విషయం స్థానిక రైతులను తీవ్రంగా కలవరపెడుతోంది. చెరువు నీరు పొలాలకు చేరకముందే లీకు, ఊటలు చిందిస్తూ వృథా అవుతుండటంతో రైతాంగం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా చిన్నకండ్లేరు చెరువును పరిశీలించిన పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్ట్ తీగలేరు (టీ 5) సాధన సమితి సభ్యులు రైతు సంఘం నాయకులు జీవి గురునాథం, కె జానకి రఘు, కోటిరెడ్డిలు మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలోని కంభం చెరువు తర్వాత రెండవ అతిపెద్ద చెరువు చిన్న కండ్లేరు చెరువు అని అన్నారు. ఇటీవల కురిసిన వర్షానికి చెరువు నిండుకుండ లాగా ఉందని కానీ చెరువుకి రెండు కెనాల్‌లు వున్నాయి లెఫ్ట్ కెనాల్ నుంచి నీరు వృధాగా వెళుతుందని వారన్నారు. ఈ లెఫ్ట్ కెనాల్ నుంచి వాటర్ బయటకు వెళ్లకుండా అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని అన్నారు, గతంలో ఇదే విధంగా నీరు వృధాగా వెళుతుంటే తూతూ మంత్రంగా మరమత్తులు చేశారని వారు అన్నారు. ఈసారి తూతూ మంత్రంగా కాకుండా శాశ్వత పరిష్కారంగా పనులు చేపట్టాలని అధికారులను వారు కోరారు. చెరువు కట్టకు ఇరువైపులా ముల్లకంపచెట్లు,జంగిల్‌తో నిండి ఉన్నదని వాటిని తొలగించిన పాపాన పోలేదన్నారు, గత వారం నుండి చెరువు కట్ట దిగువ భాగంలో ఉన్న లెఫ్ట్ కెనాల్ నుంచి భారీగా నీరు చెరువు కట్ట అంతర్భాగంలో గండి పడిందని ఈ విషయం సంబంధిత నీటిపారుదల శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. చెరువు ఆయకట్టు కింద ఇప్పటికే వరి,మిరప,మొక్కజొన్న, వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు,చెరువులో ఉన్న నీరు ఇలా వృథా అయితే రబీ పంటల సాగు దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సంవత్సరం ఇదే సమస్య ఎదురవుతోంది. చెరువు పునరుద్ధరణకు ప్రతిసారీ హామీలు ఇస్తారు కానీ ఆచరణలోకి రాకుండా పోతుంది తెలిపారు. చిన్న కండ్లేరు చెరువులో నీరు ఉన్నట్లయితే దాదాపు ఉమ్మడివరం, గారపెంట,చెన్న పాలెం, అక్కపాలెం, శతకోడు, తెల్ల గట్ల, వివిధ గ్రామాలకు భూగర్భ జలాలు పెరిగి నీటికి కొర త లేకుండా వ్యవసాయం సాగు చేసుకునే పరిస్థితి నెలకొంటుంది. కావున చెరువు కట్ట మరమ్మతు పనులు తక్షణమే నిర్వహించాలని డిమాండ్ చేశారు చేయకపోతే రైతు లను సమీకరించుకొని ధర్నాకు దిగుతామని" హెచ్చరించారు.

26న నిరసనను జయప్రదం చేయండి

రైతు సంఘం రాష్ట్ర నాయకులు డి.శ్రీనివాస్

విశాలాంధ్ర-కొమరోలు : ఈ నెల 26వ తేదీన మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్ర నాయకులు డి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన కొమరోలు ప్రచార జాత కార్యక్రమాన్ని నిర్వహించారు. డి.శ్రీనివాస్ మాట్లాడుతూ కౌలు రైతులు, వ్యవసాయ కార్మికుల రుణాలను సమగ్రంగా మాఫీ చేయాలని, రైతులకు వడ్డీ లేని రుణాలు అందించాలని, విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ బిల్లు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును విరమించాలన్నారు. నెలకు 300 యూనిట్ల లోపు గృహ వినియోగదారులకు ఉచిత విద్యుత్తు ఇవ్వాలని, పేద రైతులకు ప్రయోజనం కలిగించే విధంగా వ్యవసాయం, పాడి పరిశ్రమలలో ఉపాధి హామీని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం గిద్దలూరు నియోజకవర్గ కార్యదర్శి ధాకాల పుల్లయ్య, సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి ఊరుమార్పు జోషఫ్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బాణాల రామయ్య తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వంపై నివేదిక

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : ఉప్పుగుండూరు గ్రామ పంచాయితీ కార్యదర్శి ఏ.శ్రీనివాసరావు విధుల్లో అలసత్వంగా ఉండడంతో ఎంపీడీవో రవికుమార్ ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. శుక్రవారం ఉప్పుగుండూరు సచివాలయం 1,2లను ఆయన ఆ ఆకస్మికగా తనిఖీ చేశారు. ఆ సమయంలో సెక్రటరీ అందుబాటులో లేరు. ఎలాంటి సెలవులు లేకపోవడం, మూమెంట్ రిజిస్టర్‌లో సైతం వివరాలు లేకపోవడంతో ఎంపీడీవో అసహనం వ్యక్తం చేశారు. దీంతో పంచాయతీ సెక్రెటరీ నిర్లక్ష్యంపై ఉన్నత అధికారులకు నివేదిక అందజేసినట్లు ఎంపీడీవో తెలిపారు. పంచాయతీ సిబ్బంది ప్రతి ఒక్కరు సమయపాలన పాటించాలని సూచించారు. అదేవిధంగా విధుల్లో బాధ్యతగా నిర్వహించాలన్నారు.

బంగారు భవితకు బాలల హక్కులు

సీడీపీఓ షేక్ ఆశా బేగం

విశాలాంధ్ర-సిఎస్ పురం : మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోబాలల దినోత్సవం పురస్కరించుకొని సిఎస్పురం మండలం దర్శకుంట పేట అంగనవాడి కేంద్రంలో బాలల దినోత్సవంను ఘనంగా నిర్వహించడం జరిగింది బాలల సంరక్షణ అధికారిని శ్రీమతి షేక్ అమీషా బేగం మొదటగా చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి సత్కరించారు వాళ్లతో అంగన్వాడి కేంద్రంలో నేర్చుకున్న ఆట పాటలను వీక్షించారు. బాలలకు వివిధ పోటీలు నిర్వహించి వారికి ప్రోత్సాహకరంగా ఉండునట్లు మెమొంట్ లు మెడల్స్ తో సత్కరించారు తదుపరి కేజీబీవీ సిఎస్పురం బాలల దినోత్సవకార్యక్రమంలో బాలల హక్కులపై బాలల చట్టాలపై అత్యవసర పరిస్థితిలో ఉపయోగించాల్సిన టోల్ ఫ్రీ నెంబర్స్ పై అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ ఓ సూపర్వైజర్ దేవా కృపావరం డీఈవో రసూల్ బిపిసి సామ్యూల్ ఘర్షం అంగన్వాడి కార్యకర్త వడ్డే సరళ రెడ్డి రమ కస్తూరిబా స్కూల్ సిబ్బంది అంగన్వాడి కార్యకర్తలు పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మా భూములను రికార్డులు, ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

జేసీతో తోకపల్లి గ్రామ రైతులు

విశాలాంధ్ర-పెద్దారవీడు : పెద్దారవీడు రెవెన్యూ రికార్డులలో తమ భూములను తమ పేరిట ఆన్లైన్ నమోదు చేయాలని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణను తోకపల్లి గ్రామం రైతులు కోరారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయానికి జాయింట్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో అక్కడే ఉన్న గ్రామానికి చెందిన రైతులు మాట్లాడుతూ రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై మా గ్రామానికి చెందిన వ్యక్తి మా భూమిని తన పేరిట రికార్డులు, ఆన్లైన్లో మార్చుకున్నారని. సబ్ రిజిస్టర్ చేయించుకున్నారని, కొన్ని సర్వే నంబర్లను ట్యాంపరింగ్ చేశారని వాపోయారు. 'నెలల తరబడి రెవిన్యూ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2018-19వ సంత్సరం నుంచి రెవెన్యూ అధికారుల చుట్టు తిరిగిన పట్టించుకున్న పాపాన పోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక అధికారులు అక్రమదారునికే మద్దతులు పలుకుతున్నారని తెలిపారు. అక్రమంగా రికార్డులు, ఆన్లైన్లో నమోదు చేసుకున్న వ్యక్తి, బంధువుల పేర్లను తొలగించి మాకు న్యాయం చేయాలని రైతులు కోరారు. జేసీ మాట్లాడుతూ ఆర్ ఓఆర్ అప్పీల్ లేకుండా క్షుణ్ణంగా రెవెన్యూ రికార్డులను పరిశించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. రికార్డులు, ఆన్లైన్లో పరిశీలించిన తర్వాత రెవెన్యూ అధికారులు ఏ సమయంలో రికార్డులు, ఆన్లైన్లో సర్వే నంబర్లను మార్పులు చేశారో ఆ సమయంలో ఉన్న అధికారులను రెవెన్యూ చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. త్వరలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులు బిట్ర వెంకటలక్ష్మమ్మ, బిట్ర తిరుమలమ్మ చేతుల చలమయ్య, కనకం పుల్లయ్య, కనకం నర్సమ్మ, మేకల సుబ్బారావు, నరాల వెంకటరావు, మేకల పోతురాజు, కనకం చెన్నమ్మ, చింత కోటమ్మ, చింత ఏస్తేరమ్మ, ఉప్పలపాటి పొట్టయ్య తదిరులు ఉన్నారు. జేసీ వెంట తహసీల్దార్ దిలీప్‌కుమార్, వీఆర్వోలు ఉన్నారు.

అదుపుతప్పి బోల్తాపడిన మినీ లారీ

విశాలాంధ్ర - బేస్తవారిపేట : అదుపుతప్పి మినీ లారీ బోల్తాపడిన సంఘటన మండలంలోని పందిళ్ళపల్లి టోల్ గేట్ సమీపంలో అనంతపురం, అమరావతి నేషనల్ హైవే పై శుక్రవారం జరిగింది. వివరాల్లోకి వెళితే పోరుమామిళ్ల నుండి గుంటూరుకు అరటిపళ్ళ లోడుతో వెళుతున్న మినీ లారీ టోల్గేట్ సమీపంలోకి రాగానే అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో అరటి గెలలు రోడ్డు మీద చెల్లచెదురుగా పడిపోయాయి. ఈ ప్రమాదంలో ఎవరికీ ఏమీ కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

విశాలాంధ్ర-ఒంగోలు : ఒంగోలులోని నెక్స్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ గత అయిదు రోజులుగా వివిధ క్రీడా పోటీలు నిర్వహించింది. చివరి రోజు అయిన నవంబర్ 14 బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని క్రీడా దినోత్సవం జరుపుకోవడం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా ప్రాంతీయ పోలీస్ అధికారి డి.శ్రీనివాసరా రావు ముఖ్య అతిథిగా విచ్చేయడం జరిగింది. వారిని అశ్వారూఢులైన విద్యార్థులు గౌరవ వందనం సమర్పించారు. తదుపరి ఎన్.సి.సి. విద్యార్థులు, ఇతర విద్యార్థులు మార్చ్ పాస్ట్ నిర్వహించారు. క్రీడా జ్యోతిని వెలిగించి ఉత్సాహపూర్వకంగా శోభాయాత్ర నిర్వహించారు. తదుపరి ముఖ్య అతిథి క్రీడోత్సవాన్ని ప్రారంభించిన గుర్తుగా బుడగలు, పావురాలు ఎగురవేశారు. ముఖ్య అతిథి తన సందేశంలో ప్రస్తుత కాలంలో చాలా పాఠశాలల్లో క్రీడలు సరిగా నిర్వహించడం లేదని, నెక్స్ జెన్ స్కూల్ ఆదర్శంగా నిలుస్తున్నది అని, బాలలు మరియు యువత సోషల్ మీడియాకు అలవాటు పడి సరి అయిన వ్యాయామం లేక, సరి అయిన ఎదుగుదల లేక, సతమతమవుతున్నారని, అందువల్ల అందరూ చక్కగా ఆట పాటలలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. తరువాత విద్యార్థులకు వివిధ క్రీడలు నిర్వహించారు. అదే విధంగా రింగ్ డాన్స్, స్కేటింగ్, కరాటే, ఏరోబిక్స్, శారీ డాన్స్ వంటి వివిధ అంశాలు ప్రదర్శించారు. విద్యార్థులు గుర్రాల మీద ప్రదర్శించిన అశ్వవిన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. గత అయిదు రోజుల నుండి వివిధ విభాగాలలో గెలుపొందిన విద్యార్థులకు స్వర్ణ, రజత, కాంస్య పతకములు, జ్ఞాపికలు అందజేయడం జరిగింది. స్కూల్ డైరెక్టర్లు కె.మురళీధర్ రెడ్డి, కె. అరవింద, ప్రిన్సిపాల్ డా. ఆర్. ఎల్.వి. రమేష్ ఇతర ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిల్లలు ఎదుగుదలకు క్రీడలు దోహదం

విశాలాంధ్ర-రాచర్ల : భవిష్యత్తులో పిల్లలు గొప్ప పౌరులుగా ఎదగడానికి క్రీడలు ఎంతో దోహద పడతాయని ప్రధానోపాధ్యాయులు రమణనాయక్ అన్నారు. శుక్రవారం భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా స్థానిక జెడ్.పి.హెచ్.ఎస్. పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు అత్యంత ఉల్లాసంగా జరిగాయి. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ పాఠశాలలోని విద్యార్థిని, విద్యార్థుల కోసం వివిధ రకాల క్రీడా పోటీలను ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించడం జరిగిందని, బాల బాలికలు రోల్ బౌలింగ్, రోల్ రన్, బాక్స్ గేమ్ మరియు స్కిప్పింగ్ కాంపిటీషన్ వంటి ఆటల పోటీలను ఉల్లాసంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ పోటీల నిర్వహణ పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను, శారీరక సామర్థ్యాన్ని పెంచడానికి దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనురాధ, శేఖర్, రమణారెడ్డి, రమణయ్య, రఫీ, రామకృష్ణ, రమణారెడ్డి, శివమ్మ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ముఖ్యంగా పీడీ శివారెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు అందరూ కలిసి ఆటల పోటీలను పకడ్బందీగా నిర్వహించారు.

18న సీపీఐ ధర్నాను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - కనిగిరి : దేశంలో సామాజిక న్యాయం సమానత్వ సాధన ఆత్మ గౌరవం కోసం దళితులు, గిరిజనులు, మైనారిటీలపై జరుగుతున్న దాడులకు నిరసనగా దేశవ్యాప్త ఆందోళనలు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జాతీయ సమితి పిలుపుమేరకు ఈనెల 18న కనిగిరిలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట భారీ ధర్నా కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు కనిగిరి నియోజకవర్గ సిపిఐ సమితి తెలిపింది. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ కనిగిరి నియోజకవర్గ సమితి కార్యవర్గ సమావేశం శుక్రవారం కనిగిరిలోని స్థానిక దరిశి చెంచయ్య భవనము నందు నిర్వహించారు. ఈ కార్యక్రమాని సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి పందిటి మోహన్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత స్వతంత్ర పోరాటంలో సిపిఐ ముఖ్యపాత్ర పోషించిందని అన్నారు. రాబోయే డిసెంబర్ 26కు సిపిఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తి అవుతుందని తెలిపారు. బడుగు బలహీన వర్గాలకు అండగా భారత కమ్యూనిస్టు పార్టీ నిలిచిందని కొనియాడారు. కానీ నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక కర్షక వర్గాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నా యన్నారు. కేంద్ర ప్రభుత్వం అధికారం చేపట్టిన 11 ఏళ్ల కాలంలో దళిత గిరిజన మైనారిటీ వర్గాలపై దాడులు పెరిగాయని తెలిపారు. దేశంలో మతోన్మాద పాలన పెరిగి అనిచివేత అంటరానితనం కుల మత వివక్ష హింస పెరిగిపోతున్నాయని ఎద్దేవా చేశారు. ఈనెల 18న ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయం వద్ద మరియు మార్కాపురం, కనిగిరి ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ యాసీన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అధికారం చేపట్టిన దగ్గర నుంచి దళితులపై దాడులు పెరిగాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ సంఘ్ పరివార్ కనుసన్నాల్లో పనిచేస్తుందని బడుగు బలహీన వర్గాలను అణిచివేసే విధానాలు అవలంబిస్తుందని అన్నారు. భారత రాజ్యాంగ లౌకిక ప్రజాస్వామ్య వ్యతిరేక పాలనను కొనసాగిస్తుందని దుయపట్టారు. ఈ మేరకు సిపిఐ జాతీయ సమితి పిలుపు మేరకు ఈనెల 18న కనిగిరి ఆర్డీవో కార్యాలయం ఎదుట నిర్వహించబోయే ధర్నా కార్యక్రమానికి ప్రతి ఒక్కరు తరలిరావాలని కోరారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై రవీంద్రబాబు, సిపిఐ మండల కార్యదర్శి జి పి రామారావులు మాట్లాడుతూ ఈనెల 18న కనిగిరి ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించబోతున్నామని ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ జయప్రదం చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు. కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి గులాం హుస్సేన్, సిపిఐ రైతు సంఘం నాయకులు గుజ్జుల బాల్రెడ్డి, ఏఐటియుసి నాయకులు కాసింపీరా పాల్గొన్నారు.

ప్రైవేటు కార్యక్రమంలో ఎమ్మెల్యే బూచేపల్లి

విశాలాంధ్ర-దొనకొండ: స్థానిక కుమారపు బావి వీధిలో వైసీపీ వలంటీర్ వింగ్ మండల అధ్యక్షుడు కిన్నెర ప్రసాద్ వారి నూతన గృహ ప్రవేశానికి వైసీపీ జిల్లా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే డా.బూచేపల్లి శివప్రసాదరెడ్డి శుక్రవారం ముఖ్య అతిథిగా విచ్చేశారు. ప్రసాద్ కుటుంబ సభ్యులు బాణా సంచా, పూలాభిషేకాల నడుమ ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి శాలువ, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ప్రసాద్ కుటుంబ సభ్యులతో కలిసి రిబ్బన్ కట్ చేసిన ఎమ్మెల్యే వారికి గృహ ప్రవేశ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన వెంట మండల కన్వీనర్ కాకర్ల క్రిష్ణారెడ్డి, ఉపాధ్యక్షులు ఇండ్ల శ్రీనివాసరావు, బత్తుల వెంకటసుబ్బయ్య, కాలూరి రమణయ్య, బండారు రాజు సయ్యద్ ముజాయిద్, గొంగటి పోలిరెడ్డి, పులిమి శివ తదితరులున్నారు.

అగర్వాల్ ఐహాస్పిటల్‌లో ఘనంగా బాలల దినోత్సవం

విశాలాంధ్ర-ఒంగోలు : స్థానిక అగర్వాల్ ఐ హాస్పిటల్‌లో బాలల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిఎస్పీ శ్రీనివాసరావు హాజరయ్యారు. డిఎస్పీ మాట్లాడుతూ మనిషి అవయవాలులో నయనం ప్రధానమైనదన్నారు. కళ్లను సంరక్షించుకోవటంలో ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. భాష్యం స్కూల్ ప్రిన్సిపల్ శ్రీమతి బోయపాటి సుశీల మాట్లాడుతూ కళ్ల యొక్క ఉపయోగాలు, అధిక మొబైల్ వాడకంతో కలిగే దుష్ప్రభావాలు గురించి విద్యార్థులకు చక్కగా వివరించారు. అగర్వాల్ ఐ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ సాయి యశ్వంత్ సాయి, డాక్టర్ శిరీష మాట్లాడుతూ పిల్లల కంటి సంరక్షణ, రోజువారి జాగ్రత్తలు గురించి ఉపయోగకరమైన సూచనలు అందించారు. భాష్యం స్కూల్ విద్యార్థులు పాల్గొన్న ఈ వేడుకలో వివిధ రకాల ఆటపోటీలు, వినోదాత్మక కార్యక్రమాలు నిర్వహించగా, పిల్లలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

పేదలకు వైద్య విద్య దూరం చేసే దురాలోచనతోనే ప్రవేటీకరణ..

వైసీపీ జిల్లా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి

విశాలాంధ్ర-దొనకొండ: పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే దురాలోచనతోనే కూటమి ప్రభుత్వం ప్రవేటీకరణ బాట పట్టిందంటూ వైసీపీ జిల్లా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే డా.బూచేపల్లి శివప్రసాదరెడ్డి తెలిపారు. స్థానిక చందవరం బస్టాండ్ సెంటర్‌లో మండల కన్వీనర్ కాకర్ల క్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రవేకరణను నిరసిస్తూ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వంలో నిర్మాణాలు చేపట్టిన ప్రభుత్వ మెడికల్ కాలేజీలు పూర్తి చేస్తే జగనన్నకు పేరు వస్తుందనే కారణంతోనే ప్రవేటుపరం చేస్తున్నారని, దీంతో పేదలు అందులో చదవలేరని, వైద్యం చేయించుకోలేరని తెలిపారు. రాష్ట్రానికి రెండున్నర లక్షల కోట్లు అప్పులు తెచ్చిన చంద్రబాబు అందులో కేవలం ఒక్క శాతం కేటాయిస్తే మెడికల్ కాలేజీలు పూర్తి చేయవచ్చని, సుమారు 2550 మంది పేద విద్యార్థులకు మెడికల్ సీట్లు వస్తాయన్నారు. ఎలక్షన్స్‌లో ఇచ్చిన సూపర్ సిక్స్ వంటి హామీలను తుంగలో తొక్కి డబ్బు లేదంటూ దాట వేస్తున్నారని గుర్తు చేశారు. విద్యార్థులు, రైతులు, పింఛన్‌దారులు ప్రతి ఒక్కరికి నూటికి నూరు శాతం హామీలు నెరవేర్చింది కేవలం జగనన్న మాత్రమే అన్నారు. ముందుగా వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే అనంతరం కోటి సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కాకర్ల క్రిష్ణారెడ్డి, ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళీ, ఇండ్ల శ్రీనివాసులు, భీమినేని వెంకటేశ్వర్లు, బత్తుల వెంకట సుబ్బయ్య, కాలూరి రమణయ్య, బండారు రాజు, తమ్మనేని సుబ్బారెడ్డి, సయ్యద్ ముజాయిద్, గొంగటి పోలిరెడ్డి, ఎగ్గోని క్రిష్ణారెడ్డి, వై.నాగేశ్వరరావు, పులిమి శివ, కిన్నెర ప్రసాద్, వడ్లమూడి బుజ్జి, డోలా చంద్రా, పిక్కిలి అంకయ్య అధిక సంఖ్యలో నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ బాలల దినోత్సవం

విశాలాంధ్ర - గిద్దలూరు : జాతీయ బాలల దినోత్సవాన్ని గిద్దలూరు మండలం ముండ్లపాడు పంచాయితీ స్థానిక అమరావతి స్కూల్ నందు ఘనంగా నిర్వహించారు.ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యా శాఖాధికారి-1 అశ్విని కుమార్, ఎల్. ఐ. సి.అసిస్టెంట్ ఆఫీసర్ శేషుకుమారి పాల్గొని విద్యార్థినీ, విద్యార్థులకు జీవితంలో చదువు యొక్క గొప్పతనం,జీవిత లక్ష్యాలను చేరుకోవడానికి క్రమశిక్షణతో కూడిన విద్య ఎంతో అవసరమని పట్టుదల ఉంటే ఎంతటి కష్టమైన పనికూడా ఇష్టంగా సాధించవచ్చు అని తెలియ చేశారు. బాలల దినోత్సవం సందర్భంగా పాఠశాలలో తల్లికి వందనం కార్యక్రమాన్ని నిర్వంచారు.పాఠశాలలో విలువలతో కూడిన విద్యను అందిస్తూ విద్యార్థులను సర్వతో ముఖాభివృద్ధి తో అభివృద్ధి చేయడం పాఠశాల లక్ష్యమని పాఠశాల కరస్పాండెంట్ కె.గణేష్ యాదేవ్,పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల బాలికల జిల్లా క్రీడా జట్టుల ఎంపికకు దరఖాస్తు

విశాలాంధ్ర - సింగరాయకొండ : ప్రకాశం జిల్లా టెన్నికాయిట్ అసోషియేషన్ వారి ఆధ్వర్యంలో ఎ.ఆర్.పి అండ్ జి.వి.ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల,కేంద్ర మండల శింగరాయకొండ క్రీడా ప్రాంగణము నందు ఈ నెల 16 వ తేదీ ఆదివారము మధ్యాహ్నం 2 గంటలకు సబ్ జూనియర్ బాలబాలికల జిల్లా క్రీడా జట్ల ఎంపిక జరుగురుగుతుందని జిల్లా టెన్నికాయిట్ ప్రెసిడెంట్ కె. శ్రీకాంత్,జిల్లా టెన్నికాయిట్ అసోషియేషన్ కార్యదర్శి యన్.టి, ప్రసాద్ శుక్రవారం ప్రత్యేక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు 01.01.2011 తరువాత అట్టి వారు మాత్రమే అర్హులని, పోటీలలో పాల్గొనే క్రీడాకారులు వయస్సు ధృవీకరణ పత్రము, ఆధార్ కారును తప్పక తీసుకొనిరావలయునని తెలిపారు. మరిన్ని వివరములకు కళాశాల పి.డి.కె.శంకరరావు, సెల్.నెం : 9848125706ను సంప్రదించాలన్నారు.

విద్యుత్ ఉద్యోగులకు అండగా ఉంటా

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల హామీ

విశాలాంధ్ర -ఒంగోలు : విద్యుత్ ఉద్యోగులకు ఎల్లవేళలా అండగా ఉంటానని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు హామీ ఇచ్చారు. ఒంగోలు లోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 3 27 ప్రాంతీయ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ మొంధా తుఫాన్ సమయంలో విద్యుత్ ఉద్యోగులు ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా, నిరంతరాయం విద్యుత్ నిచ్చేందుకు ఎంతో కష్టపడ్డారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నుండి అవార్డు అందుకోటం వెనుక అనేకమంది కృషి, కష్టం ఉందని పేర్కొన్నారు. ఒంగోలు నియోజక వర్గం ప్రజలు తనను నమ్మి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, వారి నమ్మకానికి అనుగుణంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో పయనింప చేస్తానని హామీ ఇచ్చారు. యూనియన్ 70 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా విద్యుత్ ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. ఓడా చైర్మన్, జనసేన పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ మాట్లాడుతూ గతంలో దామచర్ల ఎమ్మెల్యేగా పనిచేసిన సమయంలో ఒంగోలు అభివృద్ధికి శ్రీకారం పడిందన్నారు. అయితే గత ఐదు సంవత్సరాలు కాలంలో ఒంగోలు ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. తిరిగి దామచర్ల ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఒంగోలు వేగంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు బెల్లంకొండ సురేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాం కాలంలో రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు అభద్రత భావంలో గడిపారని పేర్కొన్నారు. ఏనాడు ఒకటవ తేదీన జీతాలు తీసుకున్న పాపాన పోలేదు అన్నారు.అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగులందరూ ఓటు తేదీన జీతాలు తీసుకుంటూ, ఎటువంటి ఒత్తిడికి గురి కాకుండా ప్రశాంతమైన జీవితాన్ని అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. అందుకు ఓటమి ప్రభుత్వానికి తమ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గత ఏడాదిన్నర కాలంలో ఒంగోలులో ఎమ్మెల్యే దామచర్ల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, పట్టణ సుందరీ కరణ డాక్యుమెంటరీ ప్రదర్శన అందర్నీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల, ఓడా చైర్మన్ షేక్ రియాజ్ లను విద్యుత్ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఒంగోలు ఏఎంసి చైర్మన్ రాచగర్ల వెంకట్రావు, నగర మేయర్ గంగాడ సుజాత, విద్యుత్ శాఖ ఎస్ ఇ కట్టా వెంకటేశ్వర్లు, ఏ ఈ మాకినేని హరిబాబు, జనసేన పార్టీ జిల్లా నాయకులు, రవి ప్రియ మాల్ అధినేత కంది రవిశంకర్, ఏఎంసీ వైస్ చైర్మన్ ప్రసాద్ విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

విశాలాంధ్ర – చెరుకుపల్లి : పండిట్ జవహర్ లాల్ నెహ్రూ దేశానికి చేసిన సేవలు ఎనలేనివని రాంబట్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి సుబ్బారావు అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు వివిధ విభాగాలలో పోటీలు నిర్వహించి చాచా నెహ్రూ గొప్పతనాన్ని వారికి వివరించారు. దేశ తొలి ప్రధానిగా ఆయన ఎన్నో సాహసోపేతమైన నిర్ణయాలు ప్రజా సంక్షేమం కోసం తీసుకొని అమలు చేశారన్నారు. అనంతరం పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందించారు. శుభ తిది భోజన కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు ఇంటూరి సీతారామయ్య విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష కెరియర్ గైడ్ కౌన్సిలర్ బిట్రా జయంతి, ఉపాధ్యాయులు దివి సాంబశివరావు, మహమ్మద్ రఫీ, వై చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

పర్చూరులో...

విశాలాంధ్ర – పర్చూరు : జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని బాలల దినోత్సవంను శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు దేశభక్తి గీతాలు, వక్తృత్వం ,మొదలైన అంశాలలో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయడం జరిగినది. విజేత విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. నెహ్రూ దేశం కోసం చేసిన త్యాగాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించి చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కేడివి ప్రసాద్ ,పోలిశెట్టి హనుమంతరావు, బొజ్జా సురేష్, సుబ్బారావు, కిషోర్ ,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యద్దనపూడిలో...

విశాలాంధ్ర – యద్దనపూడి : మండలంలోని అన్ని పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జవహర్ లాల్ నెహ్రూ జన్మదినం బాలల దినోత్సవంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నెహ్రూ చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు. బాల బాలికలకు ఆటల పోటీలు , సాంస్కృతిక కార్యక్రమాలు, దేశభక్తి గీతాలు, వక్తృత్వం ,మొదలైన అంశాలలో పోటీలు నిర్వహించి, విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విజేత విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రావి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సంతమాగులూరులో...

విశాలాంధ్ర – సంతమాగులూరు : బాల్యం భగవంతుడు ఇచ్చిన గొప్ప వరం అని అలాంటి బాల్యం దశ నుంచి మంచి నడవడికతో విద్యను అభ్యసించి ఉత్తమ పౌరులుగా ఎదగాలని ప్రధానోపాధ్యాయుడు దారా బాలయ్య విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. శుక్రవారం బాలల దినోత్సవం సందర్భంగా సంతమాగులూరు మండలం పరిధిలోని పాతమాగులూరు, ఏల్చూరు, రామిరెడ్డిపాలెం, కుందుర్రు, మక్కెనవారిపాలెం, కొమ్మాలపాడు, కొప్పరం, వెల్లలచెరువు, కామేపల్లి పాఠశాలల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత భారత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చిల్డ్రన్స్ డే ప్రాముఖ్యత గురించి బాల బాలికలకు వివరించారు. అనంతరం విద్యార్థులకు వక్తృత్వ పోటీలు ఏర్పాటు చేసి, విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కుందుర్రు స్కూలులో టీచర్లు అందరూ కలిసి పిల్లలకు ప్రత్యేక భోజనాలు ఏర్పాటు చేశారు. హెచ్ఎంలు కె.మాధవి పుష్పమి, ఆర్.శ్యామల, ఎస్కె.కాశిం, శ్రీనివాసరావు, పుచ్చకాయల కోటేశ్వరరావు, టీచర్లు శివరామకృష్ణ, పేరయ్య తదితరులు పాల్గొన్నారు.

మార్టూరులో...

విశాలాంధ్ర – మార్టూరు : మార్టూరు ప్రైవేట్ పాఠశాలల్లో పండిట్ నెహ్రూ పుట్టినరోజు ను పురస్కరించుకొని బాలల దినోత్సవ వేడుకలు పోటా పోటీగా నిర్వహించారు.స్థానిక రాయల్ విద్యాసంస్థల్లో శ్రీనివాస విద్యాసంస్థల్లో ఘనంగా నిర్వహించారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. కిడ్స్ విభాగంలో చిన్నారులు ప్రదర్శించిన విచిత్ర వేషధారణ బాగా ఆకర్షించింది. సంస్థ సెక్రెటరీ కరెస్పాండంట్లు పి.రవీంద్ర బాబు, వీర గంధం శ్రీనివాసరావు పి.స్వప్న సంస్థ ఇంచార్జి కె.మధు బాబు హెడ్ మాస్టర్ డివి బాలసుబ్రహ్మణ్యం మరియు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థులకు సంస్థ అధినేత పి. రవీంద్ర బాబు బహుమతులు అందచేశారు.

చీరాలలో...

విశాలాంధ్ర – చీరాల రూరల్ : చీరాల లోని ఆంధ్ర రత్న మున్సిపల్ హైస్కూల్ పేరాలలో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మనదేశ మొదటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు. ఆటల పోటీలలో విజేతలకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణ మోహన్ రావు, ఉపాధ్యాయులు జగన్నాథచార్యులు, కుమార్, మాధవి, ప్రసాద్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రేపల్లెలో...

విశాలాంధ్ర – రేపల్లె : బాలల దినోత్సవం పురస్కరించుకొని రేపల్లె ప్రాజెక్ట్‌లోని అన్ని అంగన్వాడీ సెంటర్స్ నందు నిర్వహించటం జరిగింది. 5, 6,వార్డుల అంగన్వాడి కేంద్రాల్లో బాలల దినోత్సవానికి సిడిపిఓ సుచిత్ర ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.బాలల దినోత్సవం ప్రతి సంవత్సరం నవంబర్ 14న జరుపుకుంటారనీ స్వాతంత్ర్య భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రీ-స్కూల్ పిల్లల కోసం లెమన్ స్పూన్ రేస్, రన్నింగ్ రేస్, మ్యూజికల్ చెయిర్స్ వంటి ఆటపాట కార్యక్రమాలను ఆనందభరితంగా నిర్వహించారు. కార్యక్రమం అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. సూపర్వైజర్ హిమబిందు, సూపర్వైజర్ రాధిక,దుర్గ, శిరీష, అంగన్వాడి కార్యకర్తలు,తల్లులు స్థానిక గ్రామస్తులు పాల్గొన్నారు.

గృహాల నిర్మాణాలకు
అనుమతులు తప్పనిసరి

విశాలాంధ్ర – అద్దంకి : అద్దంకి మున్సిపాలిటీలో గృహాల నిర్మాణాలకు మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ శ్రీలక్ష్మి తెలిపారు. పట్టణంలో అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాన్ని టౌన్ ప్లానింగ్ అధికారులు శుక్రవారం నిలుపుదల చేశారు. టిపిఎస్ శ్రీ లక్ష్మీ మాట్లాడుతూ బిల్డింగ్ పేనాలైజేషన్ స్కీము జీవో ప్రకారం ఆగస్టు 2025 ముందు నిర్మించిన కట్టడములకు మార్గదర్శకాలు ప్రభుత్వం జారీ చేసినట్లు తెలిపారు. బిపిఎస్ జీవో ప్రకారం అనధికారకంగా నిర్మించిన గృహములు మరియు అదనపు అంతస్తులు పరిమితులకు మించి నిర్మించిన నిర్మాణాలను క్రమబద్ధీకరించుకోవాలన్నారు.

రైతుల సంక్షేమం కోసమే సహకార సంఘాలు

విశాలాంధ్ర – చెరుకుపల్లి : రైతుల సంక్షేమం కోసం ఏర్పాటుచేసిన వ్యవసాయ సహకార పరపతి సంఘాలు కథ 72 సంవత్సరాలుగా వారి అభివృద్ధి కోసం పనిచేస్తున్నాయని కావూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షులు మండవ తాతాజీ అన్నారు. శుక్రవారం సహకార సంఘం 72వ ఉత్సవాలను పురస్కరించుకొని సంఘ ఆవరణలో సహకార సంఘ జెండాను ఆవిష్కరించి సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. సంఘం ద్వారా చుట్టుపక్కల గ్రామాలలోని రైతులకు వ్యవసాయ రుణాలను ఇవ్వటమే కాకుండా, పంటలకు కావలసిన ఎరువులను నాబార్డు ద్వారా అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి సుఖవాసి శ్రీ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు
ఉపకార వేతనాలు పంపిణీ

విశాలాంధ్ర – చెరుకుపల్లి : స్థానిక రామయ్య పంతులు ఎయిడెడ్ పాఠశాలలో పేద విద్యార్థులకు శుక్రవారం ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. బాలల దినోత్సవం సందర్భంగా దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో 62 మంది పేద విద్యార్థులకు రూ.62వేల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ కేవీ శ్రీనివాసరావు, అద్దంకి గ్రూప్ టెంపుల్స్ అధికారి శైలేంద్ర కుమార్ పాల్గొన్నారు.

58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర - సంతమాగులూరు : సంతమాగులూరు శాఖా గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గ్రంథపాలకుడు బాదం విజయభాస్కర్ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అతిథులుగా ఎంపీపీ ఎనుబర్ల యలమంద, సర్పంచ్ పుచ్చకాయల నాగేశ్వరావు, కార్తికేయ విద్యాసంస్థల అధినేత పి.వై.శివారెడ్డి, బీసీ హాస్టల్ వార్డెన్ వై. చెన్నకేశవులు హాజరయ్యారు. ముందుగా బాలల దినోత్సవం పురస్కరించుకొని భారత తొలి ప్రధాన మంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. వారం రోజుల పాటు జరిగే వారోత్సవాల్లో పిల్లలు పాల్గొని తమ ప్రతిభను చాటాలని ఆకాంక్షించారు.

కారంచేడులో....

విశాలాంధ్ర - కారంచేడు : కారంచేడు గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు ఎం. నాగయ్య మాట్లాడుతూ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ప్రాధాన్యతను స్థానిక ప్రజలకు, విద్యార్థులకు వివరించారు. కారంచేడు మండల ఎంఈఓ 2 మెలుబంటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పుస్తకాల పుట్టుక, ముద్రణ చరిత్ర, తాళపత్ర గ్రంథాల తయారీ విధానం గురించి విద్యార్థులకు ఆసక్తికరంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

కొల్లూరులో....

విశాలాంధ్ర-కొల్లూరు : గ్రంథాలయ వారోత్సవాలు మండలంలోని కొల్లూరు, అనంతవరం శాఖా గ్రంథాలయాలలో శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జాతీయ 58వ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా తొలుత జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ చిత్ర పఠానికి పూలమాలలు వేచి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారులు వై. రాంబాబు, జి. కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

చందోలులో....

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : మండలంలోని చందోలు గ్రంథాలయంలో 58వ గ్రంథాలయ వారోత్సవాలు గ్రంథాలయ అధికారి కొడాలి మస్తాన్ రావు ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి.గ్రామ సర్పంచ్ గోరిదేవి విజయకుమారి, మునీర్ ముఖ్య అతిథిగా హాజరై జవహర్లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు అర్పించి వారోత్సవాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ గోరిదేవి విజయకుమారి మునీర్ మాట్లాడుతూ జవహర్లాల్ నెహ్రూ స్వతంత్ర భారత తొలి ప్రధానిగా, స్వాతంత్ర్య సమరంలో విశేష పాత్ర పోషించిన మహానుభావుడిగా విద్యార్థులు తెలుసుకోవాలని సూచించారు. గ్రంథాలయాలు జ్ఞాన వికాసానికి కీలక కేంద్రమన్నారు.ఈ కార్యక్రమంలో పి.శ్రావణి, షేక్ ఉన్నిస్, అమిదుల్లా ఖాన్‌తో పాటు గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిజాంపట్నంలో...

విశాలాంధ్ర - నిజాంపట్నం : నిజాంపట్నం శాఖా గ్రంథాలయంలో శుక్రవారం 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి ఎన్.విజయలక్ష్మి మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని చెప్పారు.విద్యార్థులు ప్రతి రోజూ గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలు చదవడాన్ని అలవాటుగా మార్చుకోవాలని సూచించారు.పుస్తకాలను చదవడం ద్వారా విషయ పరిజ్ఞానం, సమాజం పట్ల సమగ్ర అవగాహనను పెంపొందించుకోవచ్చునని చెప్పారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ మెంబర్స్ షేక్ తాజుద్దీన్, కొల్లిపర శ్రీనివాసరావు, షేక్ సలీం, పి.గీతాపావని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కబడ్డీలో రామకృష్ణ స్కూల్ విద్యార్థి ప్రతిభ



విశాలాంధ్ర - రేపల్లె : డాక్టర్ చలపతిరావు ఎడ్యుకేషనల్ సొసైటీ రేపల్లెలోని రామకృష్ణ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు కబడ్డీ ఆటల పోటీల్లో మండల స్థాయిలో జరిగిన పోటీల్లో మొదటి స్థానాన్ని సాధించి డివిజన్ లెవెల్ చేరుకున్నారు. డివిజన్ లెవెల్ లో కూడా మొదటి స్థానాన్ని సాధించి,జిల్లా స్థాయి ఆటల పోటీల్లో మూడో స్థానంలో నిలిచి జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, స్థానిక ఎమ్మెల్యే నరేంద్ర వర్మచే ప్రశంసలను అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కుర్ర అవర్ల, ప్రెసిడెంట్ డాక్టర్ మహేష్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటల్లో కూడా ప్రావీణ్యాన్ని కలిగి ఉండాలని ఆటపాటల్లో కూడా మా పాఠశాల విద్యార్థులను ఎప్పుడు ప్రోత్సహిస్తామని తెలియజేశారు.

ఘనంగా 72వ సహకార వారోత్సవాలు

విశాలాంధ్ర - రేపల్లె : 72వ అఖిల భారత సహకార వారోత్సవాలలో భాగంగా శుక్రవారం రేపల్లె కో- ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ నందు సహకార పతాకమును బ్యాంకు చైర్మన్ గోగినేని వెంకట సుబ్బారావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాలక వర్గ సభ్యులు, సిబ్బంది, సహకార శాఖ అధికారులు, డైరెక్టర్లు, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

మధుమేహంపై అవగాహన

విశాలాంధ్ర - కారంచేడు : మధుమేహం వ్యాధి పట్ల ప్రజలు అవగాహన పెంచుకుని, ఆ వ్యాధి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కారంచేడు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శాంతి ప్రియ తెలిపారు. శుక్రవారం గ్రామంలో మధుమేహంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిరోజు వ్యాయామం చేయడం, మద్యపానం, ధూమపానం వంటి దురలవాట్లకు దూరంగా ఉండడం ద్వారా మధుమేహాన్ని నివారించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

మోదేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో...

విశాలాంధ్ర - అద్దంకి : మండలంలోని చక్రాయపాలెం జడ్పీ హైస్కూల్ లో శుక్రవారం మోదేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు జగదీష్ శ్రీ హర్ష డయాబెటిస్పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డయాబెటిస్ రావడానికి గల కారణాలను నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. విద్యార్థులు చదువుతో పాటు శారీరక వ్యాయామం తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. శారీరక పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రత ముఖ్యమని తెలిపారు. కూల్‌డ్రింక్స్ త్రాగడం వలన కలిగే నష్టాలపైఅవగాహన కల్పించారు. ఎంఈఓ కేవి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో పుష్పయాగం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : పేరాలలో కొలువై ఉన్న శ్రీ గంగా భ్రమరాంబ సమేత శ్రీ పునుగు రామలింగేశ్వర మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో కార్తీక మాస దశమి పర్వదిన సందర్భంగా స్వామివారికి విశేష పుష్పయాగం కార్యక్రమాన్ని నిర్వహించారు. వేకువ జామునే స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చన లను ఆలయ అర్చకులు కారంచేటి రాజశేఖర్ శర్మ, అమర్ నాథ్ లు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి వారి దర్శనానికి భక్తులు, మహిళలు బారులు తీరారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

పరమేశ్వరునికి ఉసిరికాయలతో అభిషేకం

విశాలాంధ్ర - చెరుకుపల్లి : పవిత్రమైన కార్తీక మాసంలో పరమశివునికి ప్రతిరోజు వివిధ రకాలైన పుష్పాలు, ఫలాలు, పదార్థాలతో అభిషేకిస్తూ భక్తులు పరవశించి పోతున్నారు. శుక్రవారం స్థానిక శ్రీ బాల కోటేశ్వర స్వామి దేవస్థానంలో పరమేశ్వరునికి అత్యంత ప్రీతిపాత్రమైన ఉసిరికాయలతో అభిషేకాన్ని నిర్వహించారు. దేవస్థానం పాలకమండలి అధ్యక్షులు అన్నపరెడ్డి సాంబశివరావు ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. రాసంశెట్టి నాగాంజనేయులు, లకింసెట్టి వెంకటనారాయణ, సంబూరు శ్రీనివాసరావు భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : శనివారం లైనుల మరమ్మతుల కారణంగా దేవాంగపురి, పాత చీరాల, రామకృష్ణా పురం, దండు బాట, హరిప్రసాద్ నగర్, గాంధీనగర్, సాల్మన్ సెంటర్, కొత్తపాలెం, విఠల్ నగర్, ప్రాంతాలకు ఉదయం 9 నుండి 10 గంటల వరకు విద్యుత్ నిలిపివేయబడుతుందని డీ 2 అసిస్టెంట్ ఇంజినీర్ బి శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సహకరించ వలసినదిగా కోరారు.

డిసెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్

విశాలాంధ్ర - రేపల్లె : డిసెంబర్ 13 న జరుగనున్న జాతీయ లోక్ అదాలత్ లో పరిష్కారం చేయవలసిన క్రిమినల్ కేసుల గురించి రేపల్లె కోర్టు పరిధిలోని అన్ని స్టేషన్ల పోలీస్ అధికారులుతో సీనియర్ సివిల్ జడ్జి ఎస్పిడి. వెన్నెల అధ్యక్షతన రేపల్లె కోర్టు ప్రాంగణంలో సమావేశం. జరిగింది .ఈ సమావేశంలో దేవి సాయి శ్రీవాణి, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి, గీతా భార్గవి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గరికపాటి వెంకట గిరిధర్, ప్రెసిడెంట్, బార్ అసోసియేషన్, రేపల్లె టౌన్ సీఐ ఏ. మల్లికార్జునరావు తదితర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

నూతన టీడీపీ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర - జె.పంగులూరు : నూతనంగా ఎంపిక కాబడిన జెపంగులూరు మండలం టీడీపీ కార్యవర్గ సభ్యులు శుక్రవారం ముప్పవరం గ్రామం జాతీయ రహదారి వద్ద గల టీడీపీ మండల కార్యాలయంలో ప్రమాణస్వీకారం చేశారు. ముందుగా దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర పరిశీలకుడు పఠాన్ షమీమ్ ఖాన్ మండల కమిటీ గ్రామ కమిటీలు అనుబంధ కమిటీల సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. మండల పార్టీ అధ్యక్షులుగా రావూరి రమేష్ బాబు మండల మహిళా అధ్యక్షురాలుగా గుంటుపల్లి రాధారాణి, తెలుగు యువత అధ్యక్షులుగా జొన్నలగడ్డ బంగారురాజు, రైతువిభాగం అధ్యక్షులుగా చిన్నఆదిరెడ్డి, బిసి సెల్ అధ్యక్షులుగా గుడిబండ సుబ్బయ్య, ఎస్సి సెల్ అధ్యక్షులుగా అద్దేపల్లి యోహాను అన్నిగ్రామాల కమిటీల కార్యవర్గ సభ్యులు టీడీపీ అభివృద్ధి కోసం అహర్నిశలు కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ చిత్తశుద్ధితో పనిచేస్తామని ప్రమాణస్వీకారం చేశారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల గ్రామస్థాయి నాయకులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌కు 170 అర్జీలు

విశాలాంధ్ర - చీరాల రూరల్ : చీరాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. సంబంధిత అధికారులకు పంపించి త్వరితగతిన పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. 170 అర్జీలు రాగా పెన్షన్ కోసం 45 అర్జీలు, ఇళ్ల స్థలాల కోసం 105 అర్జీలు, ఇతర సమస్యలు 20 అర్జీలు వచ్చాయి. చీరాల మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు, చీరాల మండల తెదేపా అధ్యక్షులు గంజి పురుషోత్తం, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు బ్యాంకింగ్ సేవలు అందించాలి

విశాలాంధ్ర - చీరాల రూరల్ : మండలంలోని గవినివారిపాలెం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు బ్యాంకింగ్ రంగ సేవలను త్వరిత గతిన అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ భాస్కర రావు, రీజినల్ హెడ్ డీజీఎం రవికుమార్, రీజినల్ హెడ్ రామలింగేశ్వరరావు, శ్రీనివాసరావు, రాగాల శ్రీనివాస్, చీరాల మండలం తెదేపా అధ్యక్షులు గంజి పురుషోత్తం, తెదేపా గ్రామ అధ్యక్షులు నక్కల వెంకటేశ్వర్లు, కూటమి నాయకులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

రామిరెడ్డి మృతికి వైసీపీ నేతల నివాళి

విశాలాంధ్ర - సంతమాగులూరు : వైసీపీ బాపట్ల జిల్లా ప్రధానకార్యదర్శి కల్లి అంజనీ ప్రసాద్ రెడ్డికి పితృవియోగం కలిగింది. బల్లికురవ మండలం ఉప్పుమాగులూరులోని వారి స్వగృహంలో ఆయన తండ్రి కల్లి రామిరెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం ఉదయం చనిపోయారు. ఈ విషయం తెలుసుకున్న సంతమాగులూరు మండలం నుంచి వైసీపీ యువనేత గడ్డం నర్సిరెడ్డి, వెల్లలచెరువుకు చెందిన బాపట్ల జిల్లా రైతు విభాగం కార్యనిర్వాహక సభ్యులు కేసరి చెన్నారెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి పూకూరి వెంకయ్య తదితరులు హుటాహుటిన ఉప్పుమాగులూరు బయలుదేరి వెళ్లారు. ఈసందర్భంగా రామిరెడ్డి భౌతిక కాయాన్ని సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంజనీ ప్రసాద్ రెడ్డి ని పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

పవన్ కళ్యాణ్‌ను విమర్శించే స్థాయి వైసీపీ లేదు

విశాలాంధ్ర - బాపట్ల : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని విమర్శించే స్థాయి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మిధునరెడ్డికి లేదని జనసేన నాయకులు సురేష్ అన్నారు.. బాపట్ల జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి శేషాచల అటవీ ప్రాంతంలోని మంగళంపేట అటవీ భూముల్లో భారీ ఎత్తున కబ్జాలకు సంబంధించిన ఓ వీడియో విడుదల చేశారన్నారు. ఆ వీడియోలో స్పష్టంగా అడవిలో సుమారు రెండు లక్షల ఎర్రచందనం చెట్లకు పైనే ఆక్రమణకు గురైనట్లు రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు అని, ఫారెస్ట్ లో విశాల భవనం ఎలా నిర్మించారని అనుమతులు ఉన్నాయని ప్రశ్నించారు. పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి ఎక్స్ వేదికలో ఉప ముఖ్యమంత్రిపై విమర్శలు సెటైర్లు వేయటం వారి అవినీతిని కప్పుపుచ్చుకోవడమేనని ఆయన ధ్వజమెత్తారు. జనసేన నాయకులు గట్టుపల్లి తులసి కుమారి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలోని బట్లపల్లి ప్రాథమిక పాఠశాల తో పాటు అన్ని ప్రభుత్వ ,ప్రైవేటు పాఠశాలల్లో శుక్రవారం బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయురాలు సువర్ణ లత, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ తేలుకుట్ల కొండలు, పాల్గొన్నారు.

విష జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి: చిరంజీవి

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : విష జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని జడ్పీ సీఈఓ బి చిరంజీవి సూచించారు . మండలంలోని కండ్లగుంట గ్రామంలో విష జ్వరాలు నమోదవుతుందని నేపథ్యంలో ఆయన గ్రామాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో వీధులన్నిటిని శుభ్రం చేసి బ్లీచింగ్ చెల్లించాలన్నారు అదే విధంగా తాగునీటిని క్లోరినేషన్ చేయించాలన్నారు. వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి రోగులను గుర్తించాలని వారికి తగు వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఎంపీడీవో రవికుమార్, అధికారులు పాల్గొన్నారు.

స్వీయ నియంత్రణతో అదుపులో డయాబెటిస్

విశాలాంధ్ర - గిద్దలూరు : స్వీయ నియంత్రణతోనే డయాబెటిస్‌ను అదుపులోకి తీసుకురావచ్చని ప్రముఖ కంటి వైద్య నిపుణులు జీకే మోహన్ రెడ్డి అన్నారు. డయాబెటిస్ డే సందర్భంగా ఉచిత వైద్య శిబిరాన్ని గిద్దలూరులో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ జీకే మోహన్ రెడ్డి మాట్లాడుతూ మనిషికి పుట్టినప్పటినుంచి వృద్ధాప్యం వరకు ఏదో ఒక దశలో ఈ షుగర్ వ్యాధి సంభవిస్తుంది. ఎవరికి వారే శారీరక వ్యాయామాలు, ఆహార నియమాలు పాటిస్తూ స్వీయ నియంత్రణ సాధించవచ్చు అన్నారు. షుగర్ వ్యాధి అనగా రక్తంలో ఇన్సులిన్ మోతాదు తగ్గి చక్కెర మోతాదు పెరగడం వలన ఈ వ్యాధి సంభవిస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా జనాభాలో దాదాపు 6 శాతం మంది డయాబెటిస్ వ్యాధితో బాధపడుతున్నారు. దశాబ్ద కాలము నుండి దాదాపు ఈ వ్యాధి రెట్టింపు అయ్యింది

భారతదేశంలో దాదాపు 11 కోట్ల పైన ప్రజలు డయాబెటిస్ వ్యాధితో బాధపడుతున్నారు. ఈ డయాబెటిస్ వ్యాధిని సకాలంలో గుర్తించి వైద్యం చేయించుకోకపోతే శారీరక అవయాలతో పాటు మరి ముఖ్యంగా కంటి దృష్టి మెల్లగా క్షీణించి చివరికి అంధత్వానికి దారితీస్తుంది. అందుకే దీనిని సైలెంట్ కిల్లర్ లేదా నిశ్శబ్ద వ్యాధి అంటారు. డయాబెటిస్ నియంత్రణ లేకపోతే కంటిలోని రెటీనాకు సంబంధించి డయాబెటిక్ రెటినోపతి మరియు మ్యాక్యులర్ ఎడిమా, మాక్యులర్ డి జనరేషన్ అనే వ్యాధులు కూడా సంభవిస్తాయి. డయాబెటిక్ రెటినోపతి అనే వ్యాధి రాకుండా ఉండాలంటే చక్కెర వ్యాధిని మరియు రక్తపోటును(బీ.పీ) వ్యాధిని మరియు మూత్రపిండాల వ్యాధులను అదుపులో ఉంచుకోవాలి. ఈ రెటినోపతి వ్యాధిని లేజర్ చికిత్స ద్వారా మరియు విట్రియో రెటినల్ సర్జరీ ద్వారా కొంతవరకు కంటి చూపు కోల్పోకుండా నివారించవచ్చును. ఈ చక్కెర వ్యాధిని నివారించాలంటే కనీసం 45 నిమిషాల పాటు శారీరక వ్యాయామములు పాటిస్తూ మరి ముఖ్యంగా మునగాకు, బచ్చలి కూర ,క్యారెట్ ,బీట్రూట్, బ్రోకలీ, క్యాలీఫ్లవర్, చిలగడదుంప మొదలైన ఆకుపచ్చని ఆకుకూరలు కాయగూరలు మంచి పోషకాహార పదార్థాలు ఆహారంగా భుజించాలని తెలిపారు.

30వ తేదీ వరకు ఉచితంగా కంటికి సంబంధించిన వ్యాధులను చూస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

బాలల హక్కులే మానవ హక్కులు

విశాలాంధ్ర-తాళ్లూరు: బాలల హక్కులే మానవ హక్కులని మండల విద్యాశాఖాధికారి జి సుబ్బయ్య అన్నారు. డిబి ఆర్సీ ఆధ్వర్యంలో శుక్రవారం శివరామపురం ఉన్నత పాఠశాలలో బాలల హక్కుల ప్రచార ఉద్యమం నిర్వహించారు. డిబిఆర్సీ జిల్లా కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వర రావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఎంఈఓ- సుబ్బయ్య మాట్లాడుతూ రక్షణ , ప్రేమ , విద్య సమాన అవకాశాలు బాలలకు కల్పించటం మన బాధ్యత అని అన్నారు. ముందుగా పండిట్ జవహార్ నెహ్రూ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. చిల్డ్రన్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు కె వర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. బొద్దికూరపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (జనరల్)లో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు సుబ్రమణ్యచారి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఎస్ఎంసీ చైర్మన్ జి శివా రెడ్డి , రిటైర్డ్ ఏస్ ఏ ఎస్ అంజి రెడ్డి , ఉపాధ్యాయులు బి వి ఎన్ శర్మ , ఎం హరిత , విజయకుమారి , రేవతి , అంగన్ వాడీ టీచర్ నాగమణిలు పాల్గొని ఛాచాజీ నేహ్రూ చిత్ర పటానికి నివాళులు అర్పించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు , మిఠాయిలు పంచి పెట్టారు.

వెలుగు వారి పాలెం (ఏఏ) పాఠశాలలో నెహ్రూ జీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఫాస్టర్ సాల్మన్ రాజు అంగన్ వాడీ కేంద్రంలోని చిన్నారులకు ప్లేట్లు , గ్లాసులు పంపిణీ చేసారు. ప్రధానోపాధ్యాయుడు పోలం రెడ్డి సుబ్బా రెడ్డి , అంగన్ వాడీ టీచర్ సునీత తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో ఛాచా నెహ్రూ జన్మదిన వేడుకలు నిర్వహించారు. విద్యార్థులకు మిఠాయియిలు పంపిణీ చేసారు. కాగా ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ నాయకుల జయంతి , వర్ధంతి వేడుకలు నిర్వహించాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నప్పటికి ఎంపీడీఓ, తహసీల్దార్, ఉపాధి హామీ , వెలుగు కార్యాలయాలతో పాటు ఏ ఒక్క కార్యాలయాల్లో నెహ్రూ జయంతి వేడుకలు నిర్వహించక పోక పోవటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నారు.

ఉప్పుగుండూరులో....

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : బాలలను స్వేచ్ఛాయుతమైన వాతావరణంలో పెంచి సృజనాత్మకత తీర్చిదిద్ది వారికి బంగారు భవిష్యత్తును అందించాలని ఎంఈఓ రవికుమార్ పిలుపునిచ్చారు. జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా ఉప్పుగుండూరులోనే శాఖ గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమానికి టి రవికుమార్, ఏవి రమణయ్య, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని గ్రంథ పాలకురాలు డి ధనమ్మ నిర్వహించారు. గ్రంథాలయ వారోత్సవ కార్యక్రమాలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ రవికుమార్ పండిట్ జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాలలను సన్మార్గంలో ఉన్నత విలువలతో తీర్చిదిద్దడం ద్వారా ఉన్నతమైన సమాజాన్ని నిర్మించవచ్చని అన్నారు . విద్యార్థులకు చిన్నతనం నుంచి గ్రంథ పఠనం అలవాటు చేయాలన్నారు. నాగులప్పలపాడు లోనే శాఖా గ్రంధాలయంలో జరిగిన వారోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం కుమారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె చిన్నారుల ఉద్దేశించి పలు సూచనలు ఇచ్చారు. వందేమాతర గీతం నూరు వసంతాల కార్యక్రమాన్ని పురస్కరించుకొని గీతాలాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉప్పుగుండూరు సర్పంచ్ జయమ్మ, ఎంపీటీసీ వెంకట్రావు, జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానో పాధ్యాయులు ఎస్ కృష్ణవేణి , నాగులప్పలపాడు గ్రంథపాలకులు శ్రీనివాసులు, రిటైర్డ్ టీచర్ జి శేషయ్య, తేలగతోటి సామ్యూల్ ,కమిటీ సభ్యులు హరిబాబు, వై నాగరాజు, పి రాజేష్, కుశలేంద్ర రెడ్డి, జి శ్రీనివాసరావు, ఏం రాహేలు, పాల్గొన్నారు.

తాళ్లూరు డిప్యూటీ ఎంపీడీవోకు షోకాజ్ నోటీసు జారీ

విశాలాంధ్ర -తాళ్లూరు: గ్రామ పంచాయితీలలో పనిచేస్తున్న క్లాప్ మిత్రలకు పెండింగ్ జీతాలు చెల్లించాలని జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశంలో ఆదేశించినా క్షేత్ర స్థాయిలో డిప్యూటీ ఎంపీడీఓ ఆదేశాలకు అమలు చేయక పోవటం, పనితీరు కూడ 23శాతం మాత్రమే ఉండటంతో గ్రహించిన జిల్లా పంచాయితీ అధికారి వెంకటేశ్వర రావు షోకాజ్ నోటీసు జారీ చేసారు. దీంతో పాటు ఖాళీగా ఉన్న క్లాప్ మిత్ర పోస్టలను కూడ భర్తీ చెయ్యాలని ఆదేశించారు. క్లాప్ మిత్ర జీతాలు చెల్లించిన సర్పంచిలకు , గ్రామ కార్యదర్శిలకు నోటీసులు జారీ చేసి ట్రూ కాఫీలను డీపీవో కార్యాలయానికి అందజెయ్యాలని కోరారు. తగు వివరణ , నివేదిక అనుగుణంగా డిప్యూటీ ఎంపీడీఓపై చర్యలు ఉంటాయని ఉత్తర్వులలో పేర్కొన్నారు.

ఎన్‌డిఎ కూటమి విజయంపై అన్నదానం

విశాలాంధ్ర - గిద్దలూరు : బీహార్ ఎన్నికల లో ఎన్ డి ఎ కూటమి ఘనవిజయం సాధించిన సందర్భంగా పురస్కరించుకుని బిజెపి నాయకులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గిద్దలూరు పట్టణ బీజేపీ అధ్యక్షులు అప్పిశెట్టి ఉదయ్ శంకర్ ఆధ్వర్యంలో శుక్రవారం గిద్దలూరు రైల్వే స్టేషన్ ఆవరణం శుక్రవారంలో అన్న దానం చేశారు. సందర్భంగా పట్టణ అధ్యక్షులు అప్పిశెట్టి ఉదయ్ శంకర్ మాట్లాడుతూ మంచి కార్యక్రమం చేయడానికి ఏదో ఒక కారణం అవసరం లేదని సామాజిక కార్యక్రమాలు గిద్దలూరులో చేసేందుకు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో జిల్లా మాజీ ఉపాధ్యక్షులు భవ నాసి వెంకట రామాంజనేయులు, సీనియర్ నాయకులు పిడతల రమేష్ రెడ్డి, మాజీ జిల్లా ఓ బి సి ప్రధాన కార్యదర్శి బాదుల్ల, గిద్దలూరు పట్టణ ఉపాధ్యక్షులు కొప్పురపు నాగేశ్వర రావు బిజెపి టౌన్ వైస్ ప్రెసిడెంట్, మాజీ జిల్లా కార్యదర్శి ముప్పూ రీ శ్రీనివాసులు,సీనియర్ నాయకులు శివ పురం రవి కుమార్,దూదేకుల మహేష్, కొప్పుల నర్సింహులు, వర ప్రసాద్ మరియు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మధుమేహం వ్యాధి బారిన పడొద్దు

కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

విశాలాంధ్ర -బాపట్ల : మధుమేహం వంటి దీర్ఘకాలిక రోగాల భారిన పడకుండా ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. ప్రపంచ మధుమేహ దినోత్సవం శుక్రవారం జరిగింది. కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రాలను జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ స్థానిక కలెక్టరేట్ వద్ద విడుదల చేశారు. మధుమేహం వంటి రోగాలు రాకుండా ప్రజలు ముందస్తుగానే వైద్య పరీక్షలు చేయించుకుని, జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ సూచించారు.ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారిని డాక్టర్ ఎస్.విజయమ్మ తెలిపారు. ప్రపంచ మధుమేహ దినోత్సవం, శ్రేయస్సుపై అన్ని ప్రాంతాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఉద్యోగులకు రక్త పరీక్షలు నిర్వహించామన్నారు. ఇన్సులిన్ కనుగొన్న శాస్త్రవేత్త సర్ ఫ్రెడరిక్ బాంటింగ్ జన్మదినాన్ని ప్రపంచ మధుమేహ దినోత్సవంగా జరుపుకుంటామన్నారు. మధుమేహం రక్తంలో చక్కెర(గ్లోకోజ్) స్థాయి అధికంగా విడుదల అవ్వటం, ఇన్సులిన్ పనితీరు సరిగజరగక పోవటాన్ని మధుమేహ వ్యాధిగా వర్ణించారు.మధుమేహంలో రెండు రకాలు ఉన్నాయని, మొదటిది చిన్న వయసులోనే వస్తుందని, దీనికి ఇన్సులిన్ ఇంజక్షన్లు అవసరం అవుతాయన్నారు. రెండోది పెద్ద వయసు వారిలో వస్తుందని, ఇది జీవన శైలి, అధిక బరువు, ఆహార అలవాట్లు, అధిక కొవ్వు, చక్కెరలతో ఉన్న ఆహారంవల్ల, ఒత్తిడి, నిద్రలేమి, వంశపారంపర్య కారణాల వల్ల వస్తుందన్నారు. మధుమేహం వ్యాధి గురించి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని, ప్రతి ఒక్కరూ కూడా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వైద్యులు సూచించినంత మేరకు మందులు వాడాలని, అవగాహన కలిగి ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో డిఈఓ పురుషోత్తం, కార్మిక శాఖ ఉప కమిషనర్ వెంకట శివప్రసాద్, జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారతాధికారి రాజదిబోరా, వైద్యాధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర-స్వచ్ఛంధ్ర జయప్రదం చేయాలి

విశాలాంధ్ర -బాపట్ల : స్వర్ణాంధ్ర స్వచ్ఛఆంధ్ర కార్యక్రమాలను జిల్లాలో జయప్రదంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాల నిర్వహణపై జిల్లా, మండల ప్రత్యేక అధికారులు, మండల స్థాయి అధికారులతో శుక్రవారం ఆయన స్థానిక కలెక్టరేట్ నుంచి వీక్షణ సమావేశం నిర్వహించారు. మరుగుదొడ్ల శుభ్రత, వ్యక్తిగత సామాజిక శుభ్రతపై ప్రజలకు విస్తృతమైన అవగాహన కల్పించాలని కలెక్టర్ చెప్పారు. నవంబర్ 19వ తేదీన వ్యక్తిగత మరుగుదొడ్ల దినోత్సవం దృష్టిలో ఉంచుకుని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రుతువులు మారే సమయంలో ఆరోగ్య సూత్రాలు పాటించే విధానంపై ప్రజలను చైతన్య పరచాలన్నారు. ప్రజల ఆరోగ్యంగా ఉన్నప్పుడే నవ సమాజం నిర్మించగలమన్నారు. తద్వారా అభివృద్ధి వైపు ప్రజలు నడిచే అవకాశం ఉంటుందన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలలో ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలన్నారు. ప్రణాళిక ప్రకారం ఈ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. జిల్లాస్థాయి కార్యక్రమం నగరం మండలం ఎస్.వి.ఆర్ కళాశాలలో జరుగుతుందన్నారు. అధికారులంతా హాజరు కావాలన్నారు. ఈ సమావేశంలో సిపిఓ షాలేము రాజు, జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించటం బాధ్యత: ఎమ్మెల్యే

విశాలాంధ్ర - బాపట్ల : ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించటం బరువుగా అనుకోకుండా నా బాధ్యతగా అనుకుని ప్రయాణం చేయాలని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ విజ్ఞప్తి చేశారు. జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు బాపట్ల సూర్యలంక రోడ్డులో బాపట్ల డిఎస్పి రామాంజనేయులు నేతృత్వంలో నియోజకవర్గం సిఐలు ఎస్సైలు సిబ్బందితో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించి హెల్మెట్ అక్కడే కొనుగోలు చేయించి హెల్మెట్ పెట్టుకోవడం వల్ల ఉపయోగాలను వాహనదారులకు వివరించారు. అటుగా ద్విచక్ర వాహనంపై వెళుతున్న బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ పోలీస్ సిబ్బంది స్పెషల్ డ్రైవ్ ను ప్రశంసించి హెల్మెట్ తప్పనిసరిగా ధరించేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. హెల్మెట్ ధరించకపోవడం వలన కలిగే అనర్థాలు కుటుంబం అనాథులుగా మారుతారని కుటుంబం కోసం మన జీవితం కోసం ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.

శిరస్త్రాణం తప్పనిసరి :డిఎస్పీ

విశాలాంధ్ర - బాపట్ల : శిరస్త్రాణం తప్పని సరి అని ద్విచక్రవాహనదారుడు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలని డీఎస్పీ రామాంజనేయులు తెలిపారు. జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు బాపట్ల సూర్యలంక రోడ్డులో శుక్రవారం మెగా డ్రైవ్ నిర్వహించారు. హెల్మెట్ లేని వారికి హెల్మెట్ కొనుగోలు చేయించి హెల్మెట్ వాడటం వలన అవగాహన కల్గించారు. హెల్మెట్ ధరించకపోతే ప్రాణాలు కోల్పోతారని మన వెనుక మన కుటుంబం ఉందనే విషయాన్ని గ్రహించాలన్నారు. ప్రతి రోజు డ్రైవ్ కొనసాగుతుందని తెలిపారు. అటుగా ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పోలీసు సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఐలు రాంబాబు, హరికృష్ణ, శ్రీనివాసరావు ఎస్సైలు భాగ్యరాజు, చంద్రావతి, శ్రీనివాసరావు సిబ్బంది ఉన్నారు.

ఆలిండియా పోలీస్ జూడో క్లస్టర్‌లో నరేంద్ర ప్రతిభ

విశాలాంధ్ర -బాపట్ల : జాతీయ స్థాయిలో సత్తా చాటిన బాపట్ల జిల్లా కర్లపాలెం పోలీస్ కానిస్టేబుల్ వీరంకి నరేంద్రను కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ,జిల్లా ఎస్పీ బి. ఉమా మహేశ్వర్‌లు అభినందించారు. 2025 అక్టోబర్ 8 నుండి 16వ తేది వరకు జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలోని శ్రీనగర్ పట్టణంలో షేర్-ఏ-కాశ్మీరీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన 10వ ఆల్ ఇండియా పోలీస్ జూడో క్లస్టర్ 2025లో పెన్‌కాక్ సిలాట్ విభాగంలో వీరంకి నరేంద్ర సత్తా చాటి గోల్డ్ మెడల్ సాధించాడు. కలెక్టర్ వినోద్‌కుమార్‌ను ఎస్పీ ఉమామహేశ్వర్‌లను మర్యాదపూర్వకంగా కలిశాడు. ఎస్పీ గారు అతడిని ప్రత్యేకంగా అభినందించి మెడల్‌తో సత్కరించారు.జాతీయ స్థాయిలో జిల్లా పోలీస్ ఖ్యాతిని ఇనుమడింపజేస్తూ 10వ ఆల్ ఇండియా పోలీస్ జూడో క్లస్టర్ 2025లో పెన్‌కాక్ సిలాట్ విభాగంలో గోల్డ్ మెడల్‌ను సాధించడం అభినందనీయమని జిల్లా ఎస్పీ తెలిపారు. గతంలో 2018, 2024, 2025ల్లో జాతీయ స్థాయిలో జరిగిన పలు క్రీడా పోటీలలో పాల్గొని పెన్‌కాక్ సిలాట్ విభాగంలో మెడల్స్ సాధించాడన్నారు. 2025 మేలో జరిగిన 13వ జాతీయ స్థాయి పెన్‌కాక్ సిలాట్ చాంపియన్‌షిప్‌లో రజత పతకం, 2024లో జరిగిన సెకండ్ ఆల్ ఇండియా పెన్‌కాక్ సిలాట్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం, 2018లో 3వ ఆల్ ఇండియా పోలీస్ గేమ్స్‌లో కాంస్య పతకం సాధించాడని తెలిపారు. రాబోయే రోజులలో మంచి తర్ఫీదు పొంది అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటాలని జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు. జిల్లా పోలీస్ విభాగంలో క్రీడల పట్ల మక్కువ ఉన్న ప్రతిభా వంతులైన క్రీడాకారులను ప్రోత్సహిస్తామని తెలిపారు.

దీన భాస్కర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : పట్టణంలోని దగ్గుమల్లివారిపాలెం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ రిటైర్డ్ లెక్చరర్ క్రీ శే దగ్గుమల్లి రవికుమారి పుట్టినరోజు సందర్భంగా చిల్డ్రన్స్‌డే ను పురస్కరించుకొని దీన భాస్కర్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు అమె కుమారుడు ఆది ఆంధ్ర కోపరేటివ్ కలెక్టివ్ ఫార్మింగ్ సొసైటీ అధ్యక్షులు గుండాల విజయడేవిడ్‌రాజు ఆధ్వర్యంలో పలు ప్రత్యేక సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని ఉపాధ్యాయినీలకు రెండు రివాల్వింగ్ కుర్చీలు, విద్యార్థినీ విద్యార్థులకు నోటు పుస్తకములు, ప్యాడ్లు,పెన్సిళ్లు అంగన్వాడి కేంద్రానికి స్టీల్ ర్యాక్, చిన్నారులకు పలకలను పంపిణీ చేశారు.

జిల్లా అకడమిక్ మోనిటరింగ్ ఆఫీసర్ డాక్టర్ బిళ్లా మోజేస్ మాట్లాడుతూ ఇదే పాఠశాల నందు విద్యనభ్యసించి నేడు ఈ స్థాయికి చేరుకున్నానని తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.ఈ ట్రస్ట్ సేవలు ఉపయోగించుకొని మంచిగా చదువుకొని మీరు ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. నవంబర్ 14 చిల్డ్రన్స్ డే ని పురస్కరించుకొని దిన భాస్కర్ చారిటబుల్ ట్రస్ట్ వారు పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ మిఠాయిలు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో దీన భాస్కర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దగ్గుమల్లి జోసెఫ్ కెన్నెడీ, ట్రస్ట్ మెంబర్ గుండాల విమల్ సువర్ణ రాజు పెరికల అంకుల్ బాబు, దగ్గుమల్లి సుగుణ సెలీనా, సంఘ పెద్దలు బైనీడి వెంకటస్వామి, ఆదే వంశీ, హెచ్ఎం మౌనిక, ఉపాధ్యాయురాలు నాగజ్యోతి అంగన్వాడి టీచర్ తులసి, ఆయా బుల్లెమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆఫ్ చీరాల ఆధ్వర్యంలో షుగర్ పరీక్షలు

విశాలాంధ్ర - చీరాల రూరల్ : రోటరీ క్లబ్ ఆఫ్ చీరాల ఆధ్వర్యంలో ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా నెహ్రూ కూరగాయల మార్కెట్ వద్ద డా ఐ బాబూరావు సారథ్యంలో 190 మందికి షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా మండలంలోని వాడరేవు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంచినీటి సౌకర్యార్థం సింటెక్స్ వాటర్ ట్యాంకును అందజేశారు. జాలాది కృష్ణమూర్తి, తిరుమలశెట్టి లక్ష్మీ ప్రతాప్, పోలుదాసు రామకృష్ణ, డా బాబూరావు, బండారుపల్లి హేమంత్ కుమార్, డివి సురేష్, సుభాషిణి, వలివేటి మురళీకృష్ణ, హాస్పిటల్ సిబ్బంది, ప్రధానోపాధ్యాయురాలు రత్నకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు వినియోగంచుకోవాలి

తహశీల్దారు షేక్ సలీమా

విశాలాంధ్ర -బాపట్ల టౌన్ : గ్రంథాలయాలు వినియోగించుకోవాలని తహశీల్దారు షేక్ సలీమా చెప్పారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను బాపట్ల శాఖ గ్రంథాలయం నందు జరిగాయి. గ్రంథాలయ అధికారి ఏ. శివాజీ గణేషన్ ఆద్వర్యంలో అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి, నెహ్రూ చిత్రపటాని తహసీల్దార్ షేక్ షాలిమా, బాపట్ల మండల విద్యాశాఖ అధికారి ఎస్. నిరంజన్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు యొక్క ప్రాముఖ్యతను సభకు తెలియపరచి విద్యార్థినీ విద్యార్థుల చేత గ్రంథాలయ వారోత్సవాల ప్రతిజ్ఞను చేశారు. తహసీల్దార్ షేక్ షాలిమా తన ప్రసంగంలో గ్రంథాలయాలు అంటే విజ్ఞాన భండాకారాలని విద్యార్థిని విద్యార్థులు గ్రంథాలయాలకు వచ్చి అక్కడ ఉన్న పుస్తకాలను చదువుకొని విజ్ఞానవంతులు కావాలని తెలిపారు. జీవితంలో ప్రతి ఒక్కరూ ఉన్నత స్థితికి రావాలంటే ప్రతి ఒక్కరు కూడా పుస్తక పఠనం అలవాటు చేసుకుని వాటి ద్వారా ఉన్నత స్థితికి రావాలని తెలిపారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన బాపట్ల విద్యాశాఖ అధికారి ఎస్. నిరంజన్ విద్యార్థిని విద్యార్థులు ఈ పోటీ ప్రపంచంలో తట్టుకొని నిలబడాలంటే వారు తప్పనిసరిగా ఎన్నో పుస్తకాలు చదివితే గాని ఉన్నత స్థితికి రాగలరన్నారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు చాపల సుబ్రహ్మణ్యం, కార్యదర్శి శేషాద్రి నాయుడు, బాబురావు, వెంకటేశ్వర్ రెడ్డి, మొదలైన పెద్దలు గ్రంథాలయాల ఆవశ్యకతను విద్యార్థిని విద్యార్థులకు తెలిపి ఉన్నారు. గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.